



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 36 | ది. 7-5-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 36 | Date : 7-5-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |


# రెండు లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

- 39వేల మందికి ఉద్యోగ అవకాశాలు
- విశాఖలో రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్
- తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ తయారీ పరిశ్రమ
- నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దాం
- సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం
- సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం





**అమరావతి,మే 6 (వార్తాప్రభ) :** రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వస్తోంది. విశాఖలో రిలయన్స్ సంస్థ రూ.1,08,010 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అలాగే సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ను, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను కూడా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. వీటితో పాటు పలు పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది.

**ప్రతీ ఒప్పందం గ్రౌండ్ కావాలి..** రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వచ్చిన ప్రతీ ప్రతిపాదనా ఒప్పందంగా మారాలని...కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఒక పెట్టుబడి, పరిశ్రమ రాష్ట్రానికి వచ్చే విషయంలో అనుమతుల నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా జరిగేలా చూడాలన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి వరకూ నిర్దుష్టమైన కాలపరిమితిలో జరిగేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పరంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనుమతుల జారీ విషయంలో ఏపీ బ్రాండ్ సృష్టించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెట్టుబడులను ఆకర్షించాలంటే ఇతరుల కంటే మనం ఎలా భిన్నమో ఏపీలో అనుమతులు ఎంత సులభతరమ న్నది చాటి చెప్పాలని ఆయన స్పష్టం చేశారు. ఏపీలో ప్రాజెక్టులు రావాలన్న తపన ఉన్న అధికారులను అనుమ తులు ఇచ్చే స్థానాల్లో నియమించాలని సూచించారు.

**వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్‌లో ఎంఎస్ఎంఈలు కీలకం..** సచివాలయంలో జరిగిన 17వ ఎస్ఐపిబి సమావేశంలో 25 ప్రాజెక్టులకు చెందిన రూ.2,01,023 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 39,067 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో...ఎంఎస్ఎంఈలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యుర్ విషయంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయి. అన్ని పారిశ్రామిక ప్రాంతాలకు గ్యాస్ పైప్ లైన్ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఫుడ్ ప్రాసెసింగ్ లో రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేలా చూడాలి.

# ప్రజావసరాలే ప్రభుత్వ ప్రాధాన్యతలు

- కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్న ముఖ్యమంత్రి
- గురు, శుక్రవారాల్లో రాష్ట్ర సచివాలయంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్
- బెస్ట్ ప్రాక్టిసెస్‌ను ప్రజెంట్ చేయనున్న పలువురు కలెక్టర్లు, ఎస్పీలు
- అభివృద్ధి-సంక్షేమం-గ్రోత్ ఇండికేటర్లపై సమీక్షించనున్న సీఎం



**అమరావతి,మే 6 (వార్తాప్రభ) :** ప్రజావసరాలే ప్రభుత్వ ప్రాధాన్యతలు అనే దిశగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. దీన్ని పక్కాగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమావేశమవుతున్నారు. క్రమం తప్పకుండా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురు, శుక్రవారాల్లో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశం జరగనుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాల్లో జిల్లా కలెక్టర్లతోపాటు... వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఇటీవల కాలంలో ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించిన క్రమంలో జరుగుతున్న ఈ 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రాధాన్యత సంతరించుకుంది. పరిపాలనలో ప్రభుత్వ సమర్ధతను మరింత మెరుగుపరిచేలా దిశానిర్దేశం చేయడం... అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిని సమీక్షించడమే లక్ష్యంగా రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్సును సీఎం చంద్రబాబు నిర్వహించనున్నారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో భాగంగా తొలి రోజున స్వర్ణాంధ్ర పది సూత్రాలు, జిల్లాల వారీగా జీఎస్‌డీపీ గ్రోత్, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఫిర్యాదుల పరిష్కారం, పెట్టుబడులు పెట్టిన కంపెనీల గ్రౌండింగ్, ఫైళ్ల క్లియరెన్స్, ఆర్టీజీఎస్ వంటి అంశాలపై సమీక్షించనున్నారు. ఇక పలువురు కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో వివిధ అంశాల్లో అవలంభిస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను... కలెక్టర్ల సదస్సులో ప్రజెంట్ చేస్తున్నారు. ఇలా ప్రజెంట్ చేసిన వాటిల్లో బాగున్నవి... రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సీఎం ఆదేశిస్తున్నారు. ఈ క్రమంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశంలో నాలుగు జిల్లాలకు చెందిన కలెక్టర్లు... తాము ఆచరించిన బెస్ట్ ప్రాక్టీసెస్ ను తొలి రోజు ప్రజెంట్ చేయనున్నారు. అలాగే 5, 6 జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రజెంట్ చేసిన బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు ఏ మేరకు వచ్చిందనే అంశం పైనా సీఎం సమీక్షించనున్నారు. ఇక రెండో రోజు సమీక్షా సమావేశంలో సంజీవని, సమ్మర్ యాక్షన్ ప్లాన్, సూపర్ సిక్స్, సంక్షేమం, రెవెన్యూ, ఆదాయార్జనశాఖలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, శాంతి భద్రతలపై ముఖ్యమంత్రి సమీక్ష చేస్తారు. రెండవ రోజు భోజన విరామం అనంతరం జిల్లా ఎస్పీలు సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 06.30 గంటల వరకూ రెండు రోజుల పాటు కలెక్టర్ల సమావేశం జరగనుంది.

# శ్రీసిటీ కేవలం ఒక పారిశ్రామిక పార్క్ కాదు, గ్లోబల్ తయారీ కేంద్రం

- శ్రీ సిటీలో క్యారియర్ ఏసీ కంపెనీకి లోకేష్ శంకుస్థాపన
- 2028 నాటికి 80 శాతం ఏసీలు ఏపీ నుంచే తయారీ
- ఇదొక చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించిన మంత్రి లోకేష్

**తిరుపతి,మే 6 (వార్తాప్రభ) :** ప్రపంచ ప్రఖ్యాత క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ క్యారియర్ ఎయిర్ కండిషనింగ్ ఼ రెఫ్రిజిరేషన్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో రూ.1,000 కోట్ల పెట్టుబడితో నూతన తయారీ కేంద్ర నిర్మాణాన్ని బుధవారం ప్రారంభించింది. ఇది దక్షిణ భారతదేశంలో క్యారియర్‌కు తొలి తయారీ యూనిట్ కానుంది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, మానవ వనరుల శాఖ నారా లోకేష్ ముఖ్య అతిథిగా ఈ కంపెనీ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, క్యారియర్ గ్లోబల్ యాజమాన్య ప్రతినిధులు డేవిడ్ ఎల్ గిట్లిన్, మైఖేల్ ఎల్ గియర్జెస్, సుందరేశన్ నారాయణన్, శ్రీసిటీ ప్రతినిధులు శ్రీని రాజు, డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు హాజరయ్యారు. ఈ సందర్భం గా లోకేష్ మాట్లాడుతూ భారతదేశంలోని అత్యంత చురుకైన పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లలో ఒకటైన శ్రీసిటీలో నేడు ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా ఉందన్నారు. ఈ రోజు కేవలం ఒక ప్రాజెక్టును ప్రారంభించడం మాత్రమే కాదు, భారతదేశ డిజిటల్ మరియు AI అభివృద్ధి యొక్క తదుపరి అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. క్యారియర్ సంస్థ నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, క్యారియర్ కేవలం ఒక కంపెనీ కాదు, ప్రపంచం శీతలీకరణ ఆలోచన విధానాన్ని మార్చిన పయనీర్ సంస్థగా అభివర్ణించారు. "నా మొదటి ఎయిర్ కండిషనర్ కూడా క్యారియర్‌దే. కాబట్టి ఇది కేవలం వ్యాపార సంబంధం కాదు, ప్రత్యేకమైన అనుబంధం. మోడ్రన్ ఎయిర్ కండిషనింగ్‌ను కనిపెట్టడం నుండి ౹50 బిలియన్ గ్లోబల్ సంస్థగా ఎదగడం వరకు క్యారియర్ ఎప్పుడూ ఆవిష్కరణలో ముందంజలో ఉంది. ఇప్పుడు ఆ ఆవిష్కరణ మన రాష్ట్రానికి వస్తోంది. దీని ద్వారా ?1000 కోట్ల పెట్టుబడి సుమారు 3,000 స్థానిక ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఇది మన రాష్ట్రం, మన ఎకోసిస్టమ్ మరియు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంపై నమ్మకానికి నిదర్శనం" అని మంత్రి వ్యాఖ్యానించారు. "శ్రీసిటీ కేవలం ఒక పారిశ్రామిక పార్క్ కాదు, గ్లోబల్ తయారీ కేంద్రం. 8,500 ఎకరాల విస్తీర్ణంలో 31 దేశాలకు చెందిన 250 కంపెనీలు ఉన్నాయి. ౹6 బిలియన్ ఎగుమతులు, 70,000 ఉద్యోగాలు, అందులో 50% మహిళలకు చెందడం విశేషం. ఆటోమోటివ్ నుండి ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ నుండి ఇంజనీరింగ్ వరకు వేదిక అయిన శ్రీసిటీ "మేక్ ఇన్ ఇండియా" మరియు "మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్"కు ప్రతీక. ఉద్యోగుల్లో మహిళల భాగస్వామ్యం దాదాపు 50 శాతంగా వున్న శ్రీసిటీ "స్త్రీ సిటీ"గా కూడా గుర్తింపు పొందుతోంది" అని లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే "కూల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా"గా గుర్తింపు పొందింది. 9 ప్రముఖ ఏసీ తయారీ సంస్థలు, 30ం సరఫరా సంస్థలు ఇక్కడ ఉన్నాయి. 2027 నాటికి భారతదేశంకు అవసరమైన 60% ఏసీలు, 2028 నాటికి 80% ఇక్కడే తయారు అవుతాయని ఆశిస్తున్నాం అని ఆయన చెప్పారు.








**మహారాజశ్రీ నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

IA NO : 238/25

IN

OS NO : 219/2025

బిట్వీన్:

అమరనేని శ్రీనివాసరావు

-----పిటిషనర్/వాది

మరియు

1.దొడ్డ వెంకట నాగేశ్వరరావు (మరియు 3. ఇతరుల.

----రెస్పాండెంట్స్/ప్రతివాదులు

**1వ రెస్పాండెంట్/ప్రతివాది :** దొడ్డ వెంకట నాగేశ్వరరావు, తండ్రి: అప్పారావు, నివాసం: డోర్ నంబర్ : 16- 170/1, శివలయం ఎదురు, నందిగామ టౌన్, నందిగామ మండలం, NTR జిల్లా, AP

పై నెంబర్ దావా పిటిషనర్ / వాది, రెస్పాండెంట్స్/ప్రతివాదులు మీద డిక్లరేషన్ దావా వేసినారు, సదరు దావాలో 1వ రెస్పాండెంట్/ప్రతివాదివైన మీకు దావా నోటీసులు నిమిత్తం ఎన్నిమార్లు బెటాలు కట్టిననూ సదరు దావా నోటీసులు తీసుకోకుండా వుద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచునందున, ప్రత్యామ్నాయ అమలు నిమిత్తము, పిటిషనర్/వాది ఈ పత్రిక ప్రకటన ద్వారా శ్రీ కోర్ట్ వారి నుంచి ఆర్డర్ తీసుకోని యున్నారు. ది.13-05-2026వ తేదిన ఉదయం 10.00 గం,.లకు పైన తెలుపబడిన కోర్టులో మీరు కాని, మీ తరుపున న్యాయవాది హాజరై, మీ ఆక్షేపణలు తెలియ జేయగలరని, లేని యెడల శ్రీ కోర్టు వారు మీకు పరోక్షముగా తీర్మానించేదరని ఇందుములముగా తెలియ చేయట మైనది.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)**

**వాయిదా తేది.13-05-2026**

**కోర్టు :** శ్రీయుత నందిగామ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి ( జూనియర్ డివిజన్) నందిగామ

**సమయం:** ఉదయం. 10.00 గం. లకు

**ఇట్లు :**

**బెజవాడ గోపి**

**అడ్వకేట్, నందిగామ.**

**ఫోన్: 9063838333**

స్థలము : నందిగామ

తేది.06-05-2026



**మహారాజశ్రీ నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

O.S. No.219/2025

బిట్వీన్:

అమరనేని శ్రీనివాసరావు

-----వాది

మరియు

1.దొడ్డ వెంకట నాగేశ్వరరావు (మరియు 3.ఇతరులు)

----- ప్రతివాదులు

1వ ప్రతివాది అయిన దొడ్డ వెంకట నాగేశ్వరరావు, తండ్రి: అప్పారావు, నివాసం: డోర్ నంబర్ : 16-170/1, శివలయం ఎదురు, నందిగామ టౌన్, నందిగామ మండలం, NTR జిల్లా, AP.

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాదులు మీద డిక్లరేషన్ దావా వేసినారు. సదరు దావాలో 1వ ప్రతివాదివైన మీకు దావా సమన్లు నిమిత్తం ఎన్నిమార్లు బెటాలు కట్టిననూ సదరు దావా నోటీసులు తీసుకోకుండా వుద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచునందున, ప్రత్యామ్నాయ అమలు నిమిత్తము, పిటిషనర్/వాది ఈ పత్రిక ప్రకటన ద్వారా శ్రీ కోర్ట్ వారి నుంచి ఆర్డర్ తీసుకోని యున్నారు. ది.13-05-2026వ తేదిన ఉదయం 10.00 గం,.లకు పైన తెలుపబడిన కోర్టులో మీరు కాని, మీ తరుపున న్యాయవాది హాజరై, మీ ఆక్షేపణలు తెలియ జేయగలరని, లేని యెడల శ్రీ కోర్టు వారు మీకు పరోక్షముగా తీర్మానించేదరని ఇందుములముగా తెలియ చేయట మైనది.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)**

**వాయిదా తేది.13-05-2026**

**కోర్టు :** శ్రీయుత నందిగామ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి ( జూనియర్ డివిజన్) నందిగామ

**సమయం:** ఉదయం. 10.00 గం. లకు

**ఇట్లు :**

**బెజవాడ గోపి**

**అడ్వకేట్, నందిగామ.**

**ఫోన్: 9063838333**

స్థలము : నందిగామ

తేది.06-05-2026


# నిరుద్యోగులకు వయోపరిమితి 10 ఏళ్లు పెంచాలని విజ్ఞప్తి



**హైదరాబాద్,మే 6 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం త్వరలోనే తీపి కబురు అందించే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇచ్చే నోటిఫికేషన్లలో వయోపరిమితిని మరో 10 ఏళ్ల పాటు సడలించాలని పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ లు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను వేర్వురుగా కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పదేళ్ల పాటు ఎటువంటి నోటిఫికేషన్లు విడుదల కాలేదని, స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం కూడా పదేళ్ల కాలంలో ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసిందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సుదీర్ఘ 20 ఏళ్ల కాలంలో సరైన నోటిఫికేషన్లు లేక లక్షలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయి, అర్హత కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల పక్షపాతి అని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు నష్టపోకుండా ఉండాలంటే భవిష్యత్తులో విడుదలయ్యే అన్ని నోటిఫికేషన్లలో వయోపరిమితిని పెంచాలని కోరారు. తద్వారా వేలాది మంది యువతకు ఉపాధి పొందే అవకాశం లభిస్తుందని వారు వివరించారు. ఈ విన్నపంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నిరుద్యోగులకు సంబందించిన ఈ సమస్య గురించి వారితో లోతుగా చర్చించారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం వయోపరిమితి సడలింపుపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.

## ప్రెస్‌క్లబ్ నీటి బకాయిలను రికవరీ చేయండి

- 8లో




# ఏటా 15% ఆస్తి పన్ను పెంపు జివోలను తక్షణమే రద్దు చేయాలి: సిపిఐ డిమాండ్

- ప్రజలపై రూ.400 కోట్ల అదనపు భారం..
- కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి
- ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ధ్వజం

**అమరావతి,మే 6 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని పట్టణ ప్రజలపై భారంగా మారిన ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని, ఏటా 15 శాతం పన్ను పెంచే జివోలను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

**జివోలు 197, 198లను ఉపసంహరించాలి...** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విధించిన షరతులకు తలొగ్గి గత వైసీపీ ప్రభుత్వం అద్దె విలువ ఆధారిత పన్ను స్థానంలో ఆస్తి విలువ ఆధారిత పన్నును ప్రవేశపెట్టిందని ఆయన విమర్శించారు. ఇందుకోసం 44/2020 చట్ట సవరణ చేసి, జివోలు 197, 198లను తీసుకువచ్చిందని గుర్తు చేశారు. గతంలో 5 లేదా 6 ఏళ్లకు ఒకసారి పన్నులు పెంచే ఆచారం ఉండేదని, కానీ వైసీపీ హయాం నుంచి ప్రతి ఏటా 15 శాతం పన్నులు పెంచుకుంటూ పోవడం వల్ల ఐదేళ్లలో పన్ను భారం రెట్టింపు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇచ్చిన మాట తప్పిన కూటమి ప్రభుత్వం...** గత ఎన్నికల సమయంలో ప్రతి ఏటా 15 శాతం పన్ను పెంపు విధానాన్ని రద్దు చేస్తామని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ఈశ్వరయ్య గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, ఆ హామీ అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలనే ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని, ఇది ప్రజలను వంచించడమేనని దుయ్యబట్టారు.



**పట్టణ ప్రజలపై తీవ్ర ప్రభావం...** 2026 ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చిన పన్నుల పెంపుతో రాష్ట్రంలోని 123 పట్టణాల్లో ఉన్న సుమారు 1.50 కోట్ల మంది ప్రజలపై రూ. 400 కోట్ల భారం పడుతోందని ఆయన వివరించారు. 2021 నుంచి ఇప్పటివరకు ఇంటి పన్నులు 130 శాతం పెరిగాయని, ఈ ఏడాది మాత్రమే 30 శాతం వరకు పెంపు జరిగిందని గణాంకాలతో వివరించారు. భూముల విలువను పెంచడం వల్ల పన్నులు కూడా అమాంతం పెరుగుతున్నాయని, అప్పులు చేసి ఇల్లు కట్టుకున్న సామాన్యులకు ఇది పెను శాపంగా మారిందని పేర్కొన్నారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలి....** చంద్రబాబు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే క్యాపిటల్ వేల్యూ చట్టం 44/2020ని, జివోలు 197, 198లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏడాది ముగిసే వరకు ఇంటి పన్నులపై పెనాల్టీలు వేసే ప్రక్రియను నిలిపివేయాలని, పెంచిన పన్నులను తగ్గించి సామాన్యులకు ఊరట కలిగించాలని గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎంపీడీవో చిన్న రాట్నాలు



**విస్సన్నపేట,మే 6 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో నూజివీడు రోడ్డులో స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా రోడ్ల పక్కన ఉన్న చెత్త తొలగించే కార్యక్రమంను ఎంపీడీవో చిన్న రాట్నాలు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. స్వర్ణ పంచాయితీ కార్యక్రమం లో భాగంగా అడ్వాన్స్ గా పన్నులు జమ చేసే వారికి ఐదు శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క ఇంటి యజమాని వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. ఈవో హరికృష్ణ కుమార్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్లు పంపిణీ చేసిన ఎస్పీ బిందు మాధవ్

● డిఎస్పీ దేవరాజ్ పాటిల్ నేతృత్వంలోని

● హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ





**కాకినాడ,మే 6 (వార్తాప్రభ) :** జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ చేతుల మీదుగా ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో ట్రాఫిక్-1,2 స్టేషన్ల సిబ్బందికి హెల్మెట్లను అందజేయడంతో పాటు,ఎండ తీవ్రత నుండి రక్షణ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం, హెల్మెట్ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ నేతృత్వంలో పట్టణంలోని ప్రధాన జంక్షన్ల మీదుగా ట్రాఫిక్ పోలీసులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరిద్దాం -- ప్రాణాలు కాపాడుకుందాం అనే నినాదంతో సాగిన ఈ ర్యాలీలో వాహనదారులు, వెనుక కూర్చునే వ్యక్తులు కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రజలకు అవగాహన కల్పించారు.పోలీసు సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ కొరకు సహకరించిన కాకినాడ హోండా షోరూం, బజాజ్, టీవీఎస్, రాయల్ ఎన్ఫీల్డ్, హీరో హోండా, స్టార్ అండ్ స్టార్ షోరూంల యాజమాన్యాన్ని, అలాగే ఓఆర్ఎస్ పాకెట్స్ అందజేసిన అన్నమ్మ ఘాటీ మెడికల్ అసోసియేషన్ వారిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ (ఏఆర్) అడిషనల్ ఎస్పీ ఎస్. శ్రీనివాసరావు, కాకినాడ సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ పాటిల్ దేవ్ రాజ్ మనీష్,ఎస్బీ డిఎస్పీ కెవివి. సత్యనారాయణ, కాకినాడ (ఏ ఆర్) డి ఎస్ వి.జి.శ్రీహరి రావు, ట్రాఫిక్ - 1 ఇన్స్పెక్టర్ ఎన్ రమేష్, ట్రాఫిక్ - 2 ఇన్స్పెక్టర్ డి. రామారావు, ట్రాఫిక్ ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయాలనేదే లక్ష్యం



**పెనమలూరు/కానూరు,మే 6 (వార్తాప్రభ) :** ప్రజలకు ఎంతోకొంత స్వయం సేవ చేయాలనే లక్ష్యంతో మూల వెంకటరెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులు మూల వెంకట కృష్ణారెడ్డి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయన సేవా తత్పరత ఎంతో విశిష్టమైంది. గత కొన్ని సంవత్సరాలుగా వేసవి సెలవులలో ఏప్రిల్ 24 నుంచి మరలా స్కూల్ ప్రారంభం జూన్ 12 వరకు ప్రజలు ఎండ తీవ్రతతో ఉక్కిరి బిక్కిరి అవుతుంటారు. ఆ సమయంలో దాతల సహకారంతో దాదాపు 60 రోజుల పాటు నిర్విరామంగా ఎక్కడ రాజీ పడకుండా స్వచ్ఛమైన మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేసి ప్రజల మన్ననలు పొందుతున్నారు . అందులో భాగంగా బుధవారం మజ్జిగ పాత్రికేయులు అల్లాడ రామాంజనేయులు సహకారం అందించారు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో కానూరు గ్రామంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సహకారంతో రోడ్ల అభివృద్ధి చేయడం జరిగింది. రోడ్లకు ఇరువైపులా దాతల సహకారంతో పచ్చదనం ,పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా 60 వేల రూపాయలు మొక్కలు నాటి వాటిని పోషణ చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

## స్వచ్ఛపథం విజయవంతం....



**గుడ్లవల్లేరు,మే 6 (వార్తాప్రభ) :** మండలంలోని గ్రామాల్లో ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి విజయవంతం చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి సింగలూరు రోడ్డు వరకు స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి బుధవారం ఈ కార్యక్రమం వియజయవంతంగా పూర్తి చేయాలనీ ఈ కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బందులు ఎవరికి జరగకుండా జాగ్రత్త వహించాలని పంచాయతీ గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు, సిబ్బందిని ఎంపీడీఓ ఇమ్రాన్ ఆదేశించారు.

# బాల కార్మికుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలి-మంత్రి సత్య కుమార్

● బాలల హక్కుల పరిరక్షణకు కృషి చైర్మన్ వేటుకూరి





**కాకినాడ,మే 6 (వార్తాప్రభ) :** బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి వారిని అభివృద్ధిలో తీసుకురావడమే లక్ష్యంగా కమిషన్ పనిచేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ ఆకాంక్షించారు. ప్రస్తుతం జనాభా తగ్గిపోతుందని జనాభా లెక్కలు దక్షిణాదిన తక్కువగా ఉన్నాయని మంత్రి చెప్పారు. బుధవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజుకు కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వై సత్య కుమార్ ఆసక్తికరంగా మాట్లాడారు. ప్రస్తుతం జనాభా తగ్గిపోతుందని అందువల్ల జనాభా పెంచే విషయంలో ప్రజలు నిబంధనలు అనుసరించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ విషయంలో ఎటువంటి రాజీ పడవద్దని వారిని రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే విధంగా కమిషన్ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్పొరేట్ రంగంలో బాలల కోసం 25% విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సత్యకుమార్ సూచించారు. నూతన చైర్మన్గా పదవి చేపట్టిన వేటుకూరి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ కమిషన్ చైర్మన్ నిమిత్తం 390 మంది తమ దరఖాస్తులను దాఖలు చేశారని అందరూ తనను ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. బాలలకు అందుతున్న పథకాలు క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఈ కమిషన్ పనిచేస్తుందన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న కమిషన్ పరిరక్షణ నిమిత్తం ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కారం దిశగా పని చేస్తానని చెప్పారు. ప్రస్తుత వ్యవస్థలో కింది స్థాయిలో సరైన సౌకర్యాలు లేవని వాటిని అందించడమే ధ్యేయంగా కమిషన్ పనిచేస్తుందన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయించేందుకు అందరూ కలిసి పని చేస్తామని వేటుకూరి చెప్పారు. అనంతరం చైర్మన్ వేటుకూరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చల్లా మధుసూదన్ రావు, ప్రేమలత, నాగ మానస, ఉండవల్లి గాంధీ బాబు మందాల గంగ సూర్యనారాయణ, ఇంకా ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, విప్ దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్విఎస్ఎన్ వర్మ, ఎంఏ వేమా, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ముత్తా నవీన్, బిక్కిన విశ్వేశ్వరరావు, చైతన్య రాజు, ఎస్వీఎస్ అప్పలరాజు, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, తుమ్మల పద్మ, పైడా కృష్ణమోహన్, యాళ్ళ దొరబాబు, కుండల సాయికుమార్, గట్టి సత్యనారాయణ, నల్ల పవన్, కంబాల శ్రీనివాసరావు, యార్లగడ్డ రామ్ కుమార్, సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, నురుకుర్తి వెంకటేశ్వర రావు, ఆకుల వెంకటరమణ, గోడి సత్యవతి, గోడి వెంకట్, కే బీమ శేఖర్, చక్క రమేష్, గౌతు చిన్న, తదితరులు పాల్గొన్నారు

# ఫుట్బాల్ క్రీడాకారులకు జెర్సీ లు అందజేత





**మైలవరం,మే 6 (వార్తాప్రభ) :** చత్తీస్గడ్ లోని నారాయణపూర్ స్వామి వివేకానంద ఆశ్రమం నందు జరిగే ఆలిండియా ఫుట్బాల్ ఫెడరేషన్ జాతీయ యు-20 ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు జెర్సీ కిట్లు అందజేసినట్లు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ చైర్మన్ గుమ్మడపు రవీంద్ర రాణా తెలిపారు.ఆంధ్రప్రదేశ్ యు-20 ఫుట్బాల్ ప్లేయర్స్ కు జెర్సీ కిట్టుల ప్రధానోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది.ఈ కార్యక్రమా నికి విచ్చేసిన రవీంద్ర రాణా మాట్లాడుతూ మైలవరం లకిరెడ్డి హనిమి రెడ్డి క్రీడా ప్రాంగణం లోని ఏపీ ఎఫ్ఏ 32 స్టార్స్ అకాడమీ నందు ఆంధ్రప్రదేశ్ యు-20 ఫుట్బాల్ జట్టు కోచింగ్ క్యాంప్ ముగిసిందని తెలియజేశారు.అనంతరం క్రీడాకారులు,కోచ్, మేనేజర్ల కు ఆంధ్ర ఫుట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటగిరి శ్రీధర్ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మైలవరం ఫుట్బాల్ క్లబ్ ప్రెసిడెంట్ జాస్తి వెంకటేశ్వరరావు, ఏపీ ఎఫ్ఏ ఈసీ మెంబర్ బి.చక్రవర్తి, జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.శేషగిరిరావు, హెడ్ కోచ్ ఈశ్వర రావు, మేనేజర్ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అమరావతి శాస్వత రాజధాని కాదు

● చంద్రబాబు నిర్మించేది చంద్రావతి ● 12వ పిఆర్ సి నిధులు విడుదల చేయాలి ● కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతా మోహన్



**కాకినాడ,మే 6 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబు రాజధాని అమరావతి అని చెప్పి చంద్రావతి నిర్మిస్తున్నారని దీనికి లక్షల కోట్ల రూపాయలు అనవసరంగా ఖర్చు చేస్తున్నారంటూ మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నేత చింతామోహన్ విమర్శించారు. సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తమ పార్టీ నాయకులతో కలిసి చంద్రబాబు నిర్మిస్తున్న రాజధాని శాశ్వత రాజధాని కాదని తాత్కాలిక రాజధాని మాత్రమేనని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉండగా కేవలం రాజధానిలో నిర్మించే నిర్మాణాలకు ఇతర దేశాల నుండి అద్దాలను తెప్పించి 2వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత ఒక చంద్రబాబుకే చెందుతుందని చెప్పారు. అప్పులు చేసి రాజధాని నిర్మిస్తే తర్వాత పరిణామాలు ప్రజలపై ప్రజావ్యవస్థ అస్తవ్యస్తమవుతుందని దీనికి తర్వాత ఎవరు సమాధానం చెబుతారని అన్నారు.రాష్ట్రంలో అవినీతిలో కూరుకుపోయిన చంద్రబాబు, జగన్'లు త్వరలో భూస్థాపితం అవుతాయని ఆయన చెప్పారు. ఏదేమైనా ఇది ఆంధ్ర ప్రజల కలల రాజధాని కాదని కేవలం చంద్రబాబు నిర్మించుకుంటున్న చంద్రావతి అని విమర్శించారు. అలాగే ఉద్యోగులకు 12వ పిఆర్సి అమలు చేసి వారికి దీర్ఘకాలంగా రూ.30 వేల కోట్లు, నాలుగు డీఏలు తక్షణ విడుదల చేయాలని మోహన్ డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, కాకినాడ సిటీ అధ్యక్షుడు చెక్క నూకరాజు,నారయ్య పెద్దాపురం ఇంచార్జి మలకల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలు ,సమతుల్య ఎరువులవాడకంతోనే అధిక దిగుబడి : ఏడీఏ ఎన్. మోహన్ రావు



**గుంటూరు,మే 6 (వార్తాప్రభ) :** భూసార పరీక్షలు తోనే రైతులకు మేలు జరుగుతుందని గుంటూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎన్. మోహన్ రావు అన్నారు.బుధవారం గుంటూరు గ్రామీణ మండలం బుడంపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం గుంటూరు మరియు జిల్లా వనరుల కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వాడకం మరియు ధర్తి మాత బచావో అభియాన్ పై అవగాహన సదస్సు లో ఆయన పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా రైతులకు సరైన ఎరువుల వినియోగం, నేల ఆరోగ్యం పరిరక్షణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు అదేవిధంగా.నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ ను తగిన మోతాదులో వాడాలన్నారు.విత్తనం నాటిన, దుక్కిలో, మరియు 20-30 రోజుల్లోనే భాస్వరం ఎరువులు వినియోగించాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీమతి గంగాదేవి మాట్లాడుతూ భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చు తగ్గి, దిగుబడి పెరుగుతుందని,నేలలోని ఎన్.పి. కె.మరియు సూక్ష్మ పోషకాల స్థాయిలు తెలుసుకొని అవసరమైన మోతాదులోనే ఎరువులు వాడాలని,సమతుల్య ఎరువుల వాడకం ద్వారా 15--25% వరకు దిగుబడి పెరుగుతుందనీ,సేంద్రీయ ఎరువులు కూడా వినియోగించడం రైతులకు మేలుచేస్తుందన్నారు.గుంటూరు రూరల్ మండల వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ మాట్లాడుతూ రైతులు కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని,పచ్చిరొట్ట విత్తనాలు 50% సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట విత్తనాలయిన జనుములు కేజీ-- ?77/-,జీలుగ -- ?80/- ,పిల్లిపెసర -- ?98/- గా రైతులకు అందజేస్తున్నట్లు కిషోర్ పేర్కొన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో డి ఆర్సి రాజ వంశీ వ్యవసాయ విస్తరణాధికారి ఏ. సింధూర సొసైటీ అధ్యక్షులు , గ్రామ ప్రజలు ,రైతులు పాల్గొన్నారు

# నలుగురు విద్యార్థినిలకు యాదవ సేన ప్రతిభా పురస్కారాలు




**పెడన,మే 6 (వార్తాప్రభ) :** ఈ సంవత్సరం పదవతరగతి లో ఉత్తీర్ణులైన యాదవ సామజిక వర్గం విద్యార్థుల ను సత్కరించేందుకు నియోజకవర్గం యాదవ సేన నిర్ణయించింది.. పెడన నియోజకవర్గ యాదవ సేన వాట్సప్ గ్రూప్ తరపున గవర్నమెంట్ స్కూల్లో చదివి అత్యధిక మార్కులు తెచ్చుకున్న నలుగురు యాదవ విద్యార్థినిలకు ఆదివారం నాడు ప్రతిభా పురస్కారాలు అందించనున్నారు. మండలాల వారీగా వారి వివరాలు ఇలా వున్నాయి. .ఎం భవాని గూడూరు మండలం మార్కులు..531 జి శ్రావణి పెడన మండలం మార్కులు..542 లంకపల్లి మాధవి బంటుమిల్లి మండలం మార్కులు.. 535 ఏ దుర్గ కృత్తివెన్ను మండలం మార్కులు 351 నలుగురూ గవర్నమెంట్ స్కూల్ పిల్లలే కావడం గమనార్హం. నలుగురూ కష్టజీవుల బిడ్డలే ప్రతిభా పురస్కారాలు సన్మానం ఆదివారం మధ్యాహ్నం 12:00 గంటలకు మల్లేశ్వరం గీతా మందిరం లో జరగనుంది. నలుగురు ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి 5,000 చొప్పున నగదుతో పాటు శాలువాతో సత్కరించ నున్నట్టు నియోజకవర్గం యాదవ సేన ప్రతినిధి కొలుసు చందు యాదవ్ చెప్పారు.

## సూర కృష్ణపల్లవిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే



**నందిగామ,మే 6 (వార్తాప్రభ) :** ఇటీవల విడుదల అయినపదవ తరగతి ఫలితాలలో 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించి పట్టణం లో రెండో స్థానంలో నిలిచిన లింగాలపాడు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ సూర కృష్ణా కుమార్తె కృష్ణ పల్లవిని మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు బుధవారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన కృష్ణపల్లవి ని ఉన్నతవిద్య లో కూడ రానించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మరియు లింగలపాడు గ్రామ వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## విజయవాడ ఆర్‌డీవోగా వెన్నెల శ్రీను



**విజయవాడ,మే 6 (వార్తాప్రభ) :** విజయవాడ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్డీవో) వెన్నెల శ్రీను బుధవారం నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. రెవెన్యూ సేవలతో పాటు ప్రజలకు అత్యంత పారదర్శకంగా పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అందించడంలో ప్రత్యేక ముద్ర వేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా క్షేత్రస్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలని సూచిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## భూదేవి అంత అరుగు ఆకాశమంత పందిరి ఆశీస్సులు అందించిన పెద్దలు



**విస్సన్నపేట,మే 6 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో మాజీ ఉప సర్పంచ్ మంద పార్టీ సత్యనారాయణ రెడ్డి కుమార్తె చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి రూప సింధు శ్రీ నిశ్చయ తాంబూలం వేడుక సంబరాలకు భూదేవి అంత అరుగు ఆకాశమంత పందిరి మధ్య కులమత రాజకీయాలకతీతంగా ప్రజా ప్రతినిధులు విద్యాసంస్థల అధినేతలు పలు శాఖల ఉద్యోగులు హాజరై ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్, వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దే ), జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు, విస్సన్నపేట మండల ఎంపీపీ గద్దల మల్లయ్య, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు,మాజీ ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి రాజేష్ దంపతులు, వికాస్ విద్యా సంస్థల చైర్మన్ నరేడ్ల నర్సి రెడ్డి, పాలంకి విజయ భాస్కర రెడ్డి, పాలంకి మురళీమోహన రెడ్డి, కలగర మాజీ సర్పంచ్ దేశి రెడ్డి రమా శ్రీనివాసరెడ్డి దంపతులు, ఎన్టీఆర్ జిల్లా టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నెక్కలపు శ్రీనివాసరావు( దాబా శ్రీను ),దోర్నాల దామోదర రెడ్డి, వైసిపి ఎన్టీఆర్ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి సిరసాని ప్రకాష్, వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి తానంకి రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె పా౦ లక్ష్మయ్య, నటరాజ్, సూరి రాజు మాస్టారు, డొక్కు సురేష్, టిడిపి యువ నాయకుడు రాయల కిట్టు, వైసీపీ యువనేత మాధవరెడ్డి గడ్డం మధుసూదనరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని ఆశీర్వదించారు.

## కమ్మవారిపాలెంలో మంచినీటి సరఫరాకై గ్రామస్థుల నిరసన



**నందిగామ,మే 6 (వార్తాప్రభ) :** మండలం పరిధిలోని కమ్మవారిపాలెం గ్రామంలో మంచినీటి సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆద్వర్యంలో గ్రామస్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. కమ్మవారిపాలెం గ్రామంలో రక్షిత మంచినీటి పథకం వద్ద మహిళలు ఖాళీ బిందెల తో నిరసన ప్రదర్శన చేశారు. గ్రామంలో వారం రోజుల నుండి మంచినీళ్లు సరఫరా లేదన్నారు. జలజీవన్ మిషన్ పథకం పనులు అసంపూర్తిగా వున్నాయని, గ్రామానికి వచ్చే ప్రధాన పైపు లైన్లు పగిలిపోయిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో అక్రమ మట్టటారు మంచి నీటి కనెక్షన్ లు తొలగించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు కర్రి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ కమ్మవారిపాలెం గ్రామంలో తక్షణమే మంచి నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారం రోజులుగా మంచి నీరు రాక దాహార్తి తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నరని, ట్యాంక్ ల ద్వారా మంచి నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం వీడి కమ్మవారిపాలెం గ్రామంలో మంచినీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కమ్మవారిపాలెం గ్రామ సిపిఎం నాయకులు పత్తి పాటి శ్రీనివాసరావు,చెరుకుపల్లి రమేష్, సుబ్బారావు, శ్రీనివాసరావు, శ్రీరామనేని స్వామి, మంచి దనమ్మ, ఏలూరు సామ్రాజ్యం, చంద్ర దుర్గ, రాగి స్వామి, నాగలక్ష్మి, జగిని, గౌసియా నాయక్, గోపి నాయిక్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

# రైతులకు సభ్యత్వాలు రుణాలు ఇవ్వండి

**చైర్మన్ కి రైతు సమస్యలపై వినతి పత్రం ఇచ్చినకార్పొరేటర్ శ్రావణి**



**భద్రాద్రి కొత్తగూడెం మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21 వ డివిజన్ సుజాతనగర్ రైతు వేదిక లో కొత్తగూడెం సహకార సంఘం చైర్మన్ మండే వీర హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక బుధవారం నిర్వహించారు రైతు సంక్షేమ అవగాహన కార్యక్రమంలో 21 వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి పాల్గొని మాట్లాడుతూ.. కొత్తగూడెం సొసైటీ పరిధిలో భూమి కలిగి అర్హత ఉన్న రైతులకు కొత్త సభ్యత్వం, రుణాలు మంజూరు చేయాలని రైతులకు అవసరమైన ట్రాక్టర్లు,వ్యవసాయ పరికరాలు సబ్సిడీ పైన ఇప్పించాలని . ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నందున రైతులకు అవసర మైన విత్తనాలు,ఎరువులు,పురుగుమందులు సకాలంలో అందించాలని తెలిపారు మండలంలో యూరియా కొరత లేకుండా సరిపోను నిల్వలు ఎండాకాలం ముగియక ముందే ఉంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు సుజాతనగర్ మండల కేంద్రంలో రైతుల సౌలభ్యం కోసం సహకార బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేసి రైతులకు గేదేలు, గేదల షెడ్ నిర్మాణం కొరకు లోన్ ల ప్రక్రియ సులభతరం చేయాలని అన్నారు.నాబార్డ్ నిధుల ద్వారా వ్యవసాయ రంగ అనుబంధ ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసి కార్పొరేషన్ పరిధిలో ఉపాధిహామీ కోల్పోయిన వ్యవసాయ కూలీలకు జీవనోపాధి పెంచి వారి జీవనప్రమానాలు మెరుగుపరచా లని . వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కొరకు సుజాతనగర్ మండల కేంద్రంలో గోడోన్ ఏర్పాటు చేయాలని అన్నారు అనంతరం పైవి అన్ని కోరుతూ ప్రాధమిక సహకార సంఘం ఛైర్మన్ మండే వీర హనుమంతరావు కి వినతి పత్రం అందచేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వీరబాబు ,సొసైటీ వైస్ ఛైర్మన్ కూచిపూడి జగన్ ,వ్యవసాయ అధికారులు,సొసైటీ బాధ్యులు, అన్ని బ్యాంక్ ల మేనేజర్ లు, వివిధ పార్టీల నాయకులు,మండల రైతులు పాల్గొన్నారు.

## అవర్ యూత్ ఆర్గనైజేషన్' నియోజకవర్గ అధ్యక్షుడిగా గడ్డం శ్రవణ్ కుమార్



**కూకట్‌పల్లి, మే 6, (వార్తాప్రభ) :** సామాజిక సేవా రంగంలో చురుగ్గా పనిచేస్తున్న 'అవర్ యూత్ ఆర్గనైజేషన్'(ఎన్జీవో) కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా గడ్డం శ్రవణ్ కుమార్ నియమి తులయ్యారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు శ్రీహరి సిరిపంగి మంగళవారం (మే 5, 2026) అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు.

**సామాజిక సేవకు గుర్తింపు** గడ్డం శ్రవణ్ కుమార్ గత కొంతకాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయనకున్న నాయకత్వ లక్షణాలు, సమాజం పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి సంస్థ ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... శ్రవణ్ కుమార్ నాయకత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్తశుద్ధి, బాధ్యతాయుతమైన వైఖరితో సంస్థ ఆశయాల సాధనకు ఆయన కృషి చేస్తారని నమ్ముతున్నట్లు తెలిపారు.

**అభినందనల జల్లు** తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సంస్థ అధ్యక్షులకు శ్రవణ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజ శ్రేయస్సు కోసం, ముఖ్యంగా యువతను ఐక్యం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు స్నేహితులు, సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు

## కుత్బుల్లాపూర్‌లో ఎన్ ఎన్ క్రికెట్ జోన్ ప్రారంభం

**: పాల్గొన్న నేత కె.యం.ప్రతాప్**



**కుత్బుల్లాపూర్, మే 6, (వార్తాప్రభ) :** యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన వసతులను కల్పించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షుడు కె.యం.ప్రతాప్ అన్నారు. కుత్బుల్లాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ ఎన్ క్రికెట్ జోన్ ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.యం.ప్రతాప్ మాట్లాడుతూ.. యువకులు క్రికెట్ రంగంలో మెరుగైన ప్రావీణ్యం సంపాదించడానికి ఈ క్రికెట్ జోన్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. స్థానిక యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఇలాంటి ఆధునిక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నార్ల కంటి నవీన్, నర్సింగ్, నార్ల కంటి నరసింహ, నార్ల కంటి శ్యామ్, నార్ల కంటి పెద్ద శంకర్, నార్ల కంటి చిన్న శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన డిజిపి సి.వి. ఆనంద్





**హైదరాబాద్, మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్ బుధ వారం నాడు తెలం గాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు.ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ పి. సామ్ కోశిని కూడా ఆయన కలిశారు. కేవలం మర్యాదపూర్వక భేటీలో భాగంగానే ఈ సమావేశాలు జరిగాయి.

# మంథనికి సాంకేతిక మైలురాయి!!

**● ఉపాధి అవకాశాలకు కొత్త ద్వారం ● కంట్రోల్ఎస్, టాస్క్ సంయుక్త కేంద్రం ప్రారంభం ● అనిమేషన్, గేమింగ్, కృత్రిమ మేధస్సు రంగాల్లో శిక్షణ ● గ్రామీణ విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం ● హైదరాబాద్, బెంగళూరు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా అవకాశాలు ● ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**





**పెద్దపల్లి: మే 6 (వార్తాప్రభ ప్రతినిధి)**మంథని పట్టణం నూతన సాంకేతిక యుగానికి అడుగుపెట్టింది. టాస్క్--ఏవీజీసీ, కృత్రిమ మేధస్సు కేంద్రం, టాస్క్--కంట్రోల్ఎస్ ప్రతిభా కేంద్రం ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కలిసి ఈ కేంద్రాలను ప్రారంభించి గ్రామీణ యువతకు ఆధునిక అవకాశాల ద్వారం తెరిచారు. అనిమేషన్, దృశ్య ప్రభావాలు, గేమింగ్, కామిక్స్, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో శిక్షణ పొందితే విస్తృత ఉపాధి అవకాశాలు సిద్ధమవుతాయని మంత్రి తెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ మరియు కంట్రోల్ఎస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ప్రతిభా కేంద్రం పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తుందని వివరించారు. గ్రామీణ విద్యార్థులు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకునే వేదికగా ఈ కేంద్రాలు నిలుస్తాయని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కృత్రిమ మేధస్సు వంటి కోర్సుల కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు మంథనిలోనే ఈ అవకాశాలు అందుబాటులోకి రావడం ఆనందకరమని అన్నారు. ప్రాంత అభివృద్ధికి ఈ కేంద్రం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. యువత, విద్యార్థులు ఈ టాస్క్ కేంద్రాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సాంకేతిక కేంద్రాల ఏర్పాటు మంథని ప్రాంతానికి మైలురాయిగా నిలిచింది. గ్రామీణ యువతకు డిజిటల్ ప్రపంచానికి దగ్గర చేసే వేదికగా ఈ కేంద్రాలు భవిష్యత్తులో కీలక పాత్ర పోషించనున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆసక్తిగా శిక్షణా కార్యక్రమాలను వీక్షిస్తూ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలనే ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఈ కేంద్రాల ద్వారా మంథని ప్రాంతం సాంకేతిక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలు ఏర్పడటం సమాజానికి మేలని వారు అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు సృష్టించబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవం మంథని ప్రజలకు సాంకేతిక విప్లవానికి నాంది పలికింది.

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా ప్రభుత్వం!!

**● తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం ● అంతర్గాం మండలంలో గ్రామాల పర్యటన, పరిస్థితుల పరిశీలన ● రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలపై అవగాహన ● నష్ట వివరాలు నమోదు చేసి తక్షణ సహాయం అందించాలని ఆదేశాలు ● రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ● ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడుతుందని స్పష్టం ● ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**





**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 6 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అంతర్గాం మండలంలోని టిటిఎస్, పొట్యాల, మద్దిర్యాల, సోమనపల్లి, బ్రాహ్మణపల్లి, కుక్కల గూడూరు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తడిసిన ప్రతి గింజను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేస్తూ రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. తడిసిన ధాన్యానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు సేకరించి, అర్హులైన రైతులకు తగిన పరిహారం అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల కష్టాలను ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుకుని వారి నష్టాన్ని తగ్గించే దిశగా పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి వారికి అవసరమైన సహాయం అందించడంలో ఎలాంటి లోటు ఉండదని తెలిపారు. ఈ పర్యటనలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్!!

**● చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు ● గోరక్షణ పేరుతో హింసకు పాల్పడవద్దు ● రామగుండం కమిషనరేట్‌లో 8 చెక్‌పోస్టులు ఏర్పాటు ● అక్రమ రవాణాపై ప్రత్యేక డ్రైవ్‌లు, వాహనాల తనిఖీలు ● చట్ట ఉల్లంఘనపై కేసులు, వాహనాల సీజ్ చర్యలు ● రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**






**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 6 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, గోరక్షణ పేరుతో హింసకు పాల్పడటం చట్టరీత్యా నేరమని ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్, హిందూవాహిని, శ్రీరామ్ సేన, హిందూ యువవాహిని సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, చట్టపరమైన నిబంధనలు, పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. మొత్తం 08 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. దండేపల్లి గూడెం, జన్నారం ఇంద్రన్‌పల్లి, కోటపల్లి రాపన్‌పల్లి, జైపూర్ ఇంద్రారం, తాండూర్ రేపల్లెవాడ, బసంత్‌నగర్ టోల్‌గేట్, సుల్తానాబాద్ దుబ్బపల్లి, అలాగే గుంపుల ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామని చెప్పారు. పశువుల అక్రమ రవాణా మూగజీవాల పట్ల క్రూరత్వానికి దారితీస్తుందని, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్, కౌ స్లాటర్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గోరక్షకుల పేరుతో దాడులు, వాహనాల ధ్వంసం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. సమాచారం తెలిసిన వెంటనే కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597, డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. ప్రజల ప్రశాంత జీవనానికి, సామాజిక సామరస్యానికి, మూగజీవాల రక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, తాండూర్ సీఐ దేవయ్య, ఆర్ఐ పెద్దన్న, రమేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

## వెయ్యి కార్లు - 250 బస్సులతో మోదీ సభకు భారీ జన సమీకరణ

**కరీంనగర్, మే 06: (వార్తాప్రభ ప్రతినిధి)** హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈనెల 10న జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సభ విజయవంతం కోసం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి భారీ స్థాయిలో జన సమీకరణపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు.గత నాలుగు రోజులుగా కరీంనగర్‌లోనే మకాం వేసిన సంజయ్, పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ గ్రామాలు, మండలాలు, వార్డుల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. జన సమీకరణ కోసం ఇన్‌చార్జీలను నియమించి, అవసరమైన వాహనాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించారు.నేతల నుండి సేకరించిన వివరాల ప్రకారం, కరీంనగర్ పార్లమెంట్ పరిధి నుండి ఏకంగా 1000 కార్లు, 250 బస్సులు ఏర్పాటు చేసి వేలాది మందిని సభకు తరలించాలని నిర్ణయించారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు అలర్ట్!!

**● డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫీజు నోటిఫికేషన్ విడుదల**
**● ఫీజు చెల్లింపు చివరి తేదీ: 19 మే, 2026**
**● పరీక్షల నిర్వహణ జూన్ 14 నుండి జూలై 06 వరకు**
**● కో ఆర్డినేటర్ డా.జి. సుబ్బారావు**

**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 6 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖనిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రం డిగ్రీ విద్యార్థుల కోసం బుధవారం ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం బి.ఏ, బి.కామ్, బి.ఎస్సీ కోర్సులు చదువుతున్న మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులు తమ పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. మొదటి సంవత్సర విద్యార్థులు 2వ సెమిస్టర్, రెండో సంవత్సర విద్యార్థులు 4వ సెమిస్టర్, మూడో సంవత్సర విద్యార్థులు 6వ సెమిస్టర్ పరీక్షల కోసం ఈ నెల 19వ తేదీ లోపు ఫీజు కట్టాలి. ప్రతి సబ్జెక్టుకు 150 రూపాయల చొప్పున ఫీజు నిర్ణయించగా, బి.ఎస్సీ, బి.కామ్ కంప్యూటర్స్ విద్యార్థులు అదనంగా ల్యాబ్ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజును తెలంగాణ ఆన్‌లైన్ లేదా మీ-సేవ కేంద్రాల ద్వారా మాత్రమే చెల్లించాలని అధికారులు సూచించారు. ఇక వీరికి సంబంధించిన పరీక్షలు జూన్ 14వ తేదీన ప్రారంభమై జూలై 6వ తేదీ వరకు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అధ్యయన కేంద్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ జి. సుబ్బారావు, ప్రిన్సిపాల్ కిషన్ ఓజా అధికారికంగా వెల్లడించారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా సకాలంలో ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావాలని వారు కోరారు. ఏదైనా సమాచారం కోసం స్టడీ సెంటర్ పనివేళల్లో సంప్రదించవచ్చని తెలియజేశారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు.

## కొలన్ హన్మంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బొంగునూరి కిషోర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, మే 6, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ ఠ కో-ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఘన సన్మానం** హన్మంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ వేడుకల్లో కిషోర్ రెడ్డి ఆయనకు పూలగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధిలోనూ, పార్టీ బలోపేతంలోనూ హన్మంత్ రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కావాలి గణేష్, ఏ ఆర్.సాధు యాదవ్, నరసింహ రెడ్డి, శ్రీశైలం యాదవ్, మహేందర్ రెడ్డి, గజ, గంట శివారెడ్డి, మహేష్, శ్రీశైలం ముదిరాజ్ మరియు బికెఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## పూలే సావిత్రిబాయి లా జంట విగ్రహాలకుఅన్ని విధాల సహకరిస్తా..

**మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్.**



**జవహర్ నగర్,మే 6:(వార్తా ప్రభ)** కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే జంట విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో బుధవారం రోజున మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ని బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు సోమచారిఆధ్వర్యంలో బీసీల ఐక్య వేదిక కార్యవర్గం కలిసి వారి సమస్యలను వివరించడం జరిగింది. వేంటేనే స్పందించిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ మాట్లాడుతూ సామాజిక విప్లవ పితామహుడు బీసీల ఆరాధ్య దైవం మహాత్మ జ్యోతిరావు పూలే, తొలి మహిళ టీచర్ సావిత్రిబాయి పూలేల విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై బీసీ ఐక్యవేదికను అభినందించడం జరిగింది. అంతేకాకుండా ఎలాంటి సమస్యలు తలెత్తిన వాటిని పరిష్కారం చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ బిజెపి పార్టీ అధ్యక్షులు కమలాకర్ చారి, బిసి ఐక్యవేదిక ఉపాధ్యక్షులు రమేష్ బాబు, చంద్ర కార్యదర్శులు, పాక దేవేందర్, ఏ రాజు యాదవ్, గాలయ్య చారి, నాగరాజుచారి, బుజ్జి, చంద్రశేఖర్ చారి, రామాచారి, హనుమంతు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప దేవాలయ పునర్నిర్మాణ ప్రారంభోత్సవం-ఎమ్మెల్యే పాయల్ శంకర్

**అదిలాబాద్'మే 06 (వార్తా ప్రభ)** ప్రపంచమంతా నేడు భారత దేశ సంస్కృతి వైపు చూస్తున్నదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.బుధవారం ఆదిలాబాద్ లోని శంకర్ గుట్ట లో శ్రీ బీరప్ప దేవాలయ పునర్నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## విజయ్ కి పవన్ కి పోలిక అంతవరకే !

తమిళనాడులో విజయ్ తన టీవీకే పార్టీ ద్వారా విజయం సాధించిన నేపథ్యంలో అందరూ పవన్ కళ్యాణ్ మీద పడ్డారు. సోషల్ మీడియా వేదికగా ఆయన్ని ట్రోల్ చేయడం ప్రారంభించారు. దానికి కారణం పవన్ విజయ్ ఇద్దరూ సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వారే. ఇద్దరూ సినీ రంగంలో టాప్ స్టార్స్ గా ఉన్న వారే. దాంతోనే ఈ పోలిక వచ్చింది. పవన్ పదేళ్ళ రాజకీయం తరువాత మూడు ఎన్నికలు చూసి ఉప ముఖ్యమంత్రి అయితే విజయ్ పార్టీ పెట్టిన రెండేళ్ళలోనే సీఎం అవుతున్నారు. దాంతో పవన్ అక్కడికి ఏదో తక్కువ అన్నట్లుగా ట్రోల్స్ చేస్తున్నారు. రాజకీయాలు అంటేనే చిత్రమైనవి. పైగా ప్రజా జీవితంతో ముడిపడి ఉన్నవి. వాటిలో విజయాలు అన్నవి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటాయి. ఏపీకి తమిళనాడుకు అనేక విషయాలలో తేడాలు ఉన్నాయి. అక్కడ జనాలు చూసే దానికి ఏపీ ప్రజలు ఆలోచించే దానికి కూడా చాలా తేడాలు కనిపిస్తాయి అని విశ్లేషిస్తున్నారు. తమిళనాడులో మొదటినుంచి స్టార్ హీరోలకు జనాలు పట్టం కడుతున్నారు. సినీ రంగం నుంచి రాజకీయ రంగంలోకి వచ్చిన వాళ్ళకి బ్రహ్మరథం పడుతున్నారు. అది ఈనాటిది కాదు ఒక కరుణానిధి ఎంజీఆర్ జయలలిత ఇలా చూసుకుంటే సినీ రంగం నుంచి రాజకీయాలకు వచ్చి అద్భుతాలు సృష్టించిన వాళ్ళు చాలామంది ఉన్నారు. అలా టీవీకే అధినేత విజయ్ విజయం కూడా ఆ విధమైనదే అని టాలీవుడ్ కి చెందిన ప్రముఖులు భావిస్తున్నారు. తెలుగు నాట చూస్తే కనుక అంతటి సినీ రాజకీయ బంధం లేదు. తమిళనాడులో ఈ బంధం దశాబ్దాలు గా కొనసాగుతోంది. అందుకే విజయ్ రాజకీయ రంగ ప్రవేశం అంత సులువుగా జరగడమే కాదు మంచి విజయాలను కూడా అందుకునేలా చేసింది. ఇక తమిళనాడులో అధికార డిఎంకె పట్ల ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది అదే సమయంలో విపక్షంలో ఉన్న అన్నాడీఎంకెలో సరైన నాయకత్వం లేదు చరిష్మా ఉన్న లీడర్ షిప్ లేదు. దాంతో రాజకీయ శూన్యత అనేది అక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. దానిని సరిగ్గా అంచనా వేసుకున్న విజయ్ తమిళనాడు ప్రజల సెంటిమెంటును కూడా బలంగా నమ్మి సినీ రంగం నుంచి నేరుగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అది కూడా కరెక్ట్ టైం తో టైమింగ్ తో జరిగింది. దాంతో విజయ్ పార్టీ టీవీకే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక సునామీనే సృష్టించింది. అయితే తెలుగులో ముఖ్యంగా ఏపీలో పవన్ కళ్యాణ్ కి ఎందుకు ఈ సినీ మ్యాజిక్ పనిచేయలేదు అంటూ చాలా మంది అడుగుతున్నారు. సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ తెలుగులో మరీ ముఖ్యంగా ఆంధ్రాలో తమిళనాడు అంతగా సినీ రాజకీయ బంధం పెనవేసుకోలేదు. ఒక్క ఎన్టీ రామారావు విషయం ఒక ప్రత్యేకత, అది ఎలా అంటే ఆయన రామాయణ మహాభారత పురాణ గాధల నుంచి ఎన్నో పాత్రలు తీసుకొని వెండితెరపై నటుడుగా ఎన్టీఆర్ అందంగా ఆవిష్కరించారు. ఆయనను తెలుగు ప్రజానీకం ఒక దేవుడిగా రాముడుగా భావించింది. ఆయన సినిమాల్లోనే కాకుండా అనేక సామాజిక కార్యక్రమాలు కూడా చేపట్టడం ద్వారా ప్రజలకు మరింత చేరువ అయ్యారు. ఇక నలభై రెండేళ్ల క్రితం రాజకీయం వేరు. అప్పట్లో కాంగ్రెస్ ఒక్కటే ప్రధాన పక్షం. సరైన ప్రతిపక్షం లేకపోవడం ఏకధాటిగా మూడున్నర దశాబ్దాలు కాంగ్రెస్ పాలన సాగడంతో జనాలు విసిగి పోయారు. ఆ సమయంలో ఎన్టీఆర్ పార్టీ పెట్టి సక్సెస్ అయ్యారు. అలా తమిళనాడు కి తెలుగునాడుకూ చాలా విషయాల్లో తేడాలు ఉన్నాయి. అందువల్లనే పవన్ కళ్యాణ్ విషయంలో ఒంటరి పోరాటం తెలుగులో సరైన ఫలితాలు ఇవ్వలేకపోయింది. అదే విజయ్ తమిళ సెంటిమెంట్లు కలిసి రావడంతో సక్సెస్ అయ్యారన్నది టాలీవుడ్ ప్రముఖుల రాజకీయ విశ్లేషణగా కనిపిస్తోంది. అక్కడ సినీ రాజకీయ అనుబంధంతో విజయ్ సాధించిన విజయం కూడా ఎంజీఆర్ కోవలోకి చెందినదేనని వారు అంటున్నారు. అందువల్ల తెలుగులో పవన్ కళ్యాణ్ కి సినీ ఇమేజ్ పూర్తిగా ఉపయోగపడలేదు అనడం తప్పు అని చాలామంది భావిస్తున్నారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని దర్శించుకున్న ఎస్. ఐ. అర్జున్



**పెనుగంచిప్రోలు, మే 6( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లో వెంచేసివున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని స్థానిక ఎస్ ఐ అర్జున్ బుధవారం దర్శించు కున్నారు, ఆలయ సిబ్బంది ప్రత్యేక పూ జలు నిర్వహించి ఆశీర్వాచం అంధించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు, అనంతరం ఆలయం లో నిర్వహించు తున్న అన్నదానం కార్యక్రమానికి తన వంతు ఆర్ధిక సహాయాన్ని అందించారు.

## పరోపకారులు పుడమిలో

రాలిపోయే ఆకులు
వాడిపోయే పూవులు
నేర్పును జీవిత సత్యము
గుర్తించుకో నిత్యము
అస్తమించే సూర్యుడు
పుంజుకుని ఉదయించును
సంగ్రామంలో యోధుడు
త్యాగాన్ని కనుపరచును
ప్రవహించే సెలయేరులు
ప్రార్ధించే అధరాలు
పరోపకారం చేయును
ప్రేమించే హృదయాలు
స్వార్ధగుణమే అల్పము
కల్గియుంటే నష్టము



త్యాగగుణమే శ్రేష్టము
జీవితాన ఘనము ఘనము

**-గద్వాల సోమన్న,**

ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించిన ఆర్‌జేటీసీ వడ్డే సుందర్

### ఆర్‌జేటీసీని కలిసి కృతజ్ఞతలు తెలిపిన జోనల్ అధ్యక్షుడు ఎం. రాజుబాబు



**విజయవాడ: మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక బందరు రోడ్డులోని రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం రవాణాశాఖ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన సందర్భంగా ఆర్‌జేటీసీ వడ్డే సుందర్‌ను ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌జేటీసీ వడ్డే సుందర్ మాట్లాడుతూ, జోన్--II పరిధిలో జూనియర్ అసిస్టెంట్లను సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులు మరింత బాధ్యతతో విధులు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆయన సూచించారు. నిష్పాక్షికంగా, పారదర్శకంగా సేవలు అందించడం ద్వారా ప్రభుత్వానికి, రవాణాశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజల్లోనూ, అధికారులలోనూ మంచి



గుర్తింపు పొందేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆయన అన్నారు. జోనల్ అధ్యక్షుడు ఎం. రాజుబాబు మాట్లాడుతూ, చాలా కాలంగా ఎదురుచూస్తున్న సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులను ఆర్ జేటిసి గా జోన్2 బదిలీపై వచ్చిన తక్కువ సమయంలోనే అమలు చేయడం పట్ల ఆర్‌జేటీసీ వడ్డే సుందర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత వారం తనతో పాటు సంఘ నాయకులు కలిసి పదోన్నతుల విషయంపై వినతిపత్రం సమర్పించగా, దానిపై సానుకూలంగా స్పందించి ఉద్యోగుల మేలు చేసే విధంగా నిర్ణయం తిసుకుంటామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పదోన్నతులు కల్పించడంతో పాటు ఉద్యోగులను వారు కోరుకున్న స్థానాల్లో నియమించడం మరింత సంతోషకరమన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ సానుకూలంగా స్పందించే అధికారి గా వడ్డే సుందర్‌ను కొనియాడారు. ఆర్ జె టి సి వడ్డే సుందర్ చేతుల మీదుగా పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ సహాధ్యక్షుడు డి. రామ్మూర్తి, కోశాధికారి కె. రామచంద్రరాజు,, జి ఆర్ శ్రీకాంత్, పదోన్నతులు పొందిన సభ్యులు పి. చాందిని, యం. మణిస్విని, యం. రవి తేజ, కె. లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ వంట గ్యాస్ దుర్వినియోగం హోటళ్లకు బ్లాక్‌లో సరఫరా

### డెలివరీ బాయ్స్ చేతుల మీదుగా అక్రమంగా గ్యాస్ మార్పిడి



**పెనుగంచిప్రోలు, మే 6( వార్త ప్రభ )** గృ హ వంట గ్యాస్ దుర్వినియోగం అవుతుంది హోటళ్లకు బ్లాక్ లో సరఫరా డెలివరీ బాయ్స్ చేతులు మీదుగా అక్రమంగా గ్యాస్ మార్పిడి బ్లాక్‌లో (2000)లకు కొనుగోలు టీ, టిఫిన్ ధరలు పెంపుతో ప్రజలపై భారం పడుతుంది. అయినా రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు ఎక్కడ ? గ్యాస్ ఏజెన్సీలపై తక్షణ చర్యలు అవసరం. గృహ అవసరాలకు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వంట గ్యాస్‌ను హోటళ్లకు అక్రమంగా సరఫరా చేస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది, సాధారణంగా ఇంటి అవసరాల కోసంమాత్రమేఉపయోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను కొంతమంది డెలివరీ బాయ్స్, గ్యాస్ ఏజెన్సీల సహకారంతో హోటళ్లకు బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్లాక్ మార్కెట్ గ్యాస్‌తో హోటళ్ల వ్యాపారం...హోటల్ యజమానులు కమర్షియల్ గ్యాస్ తీసుకోవడం ఖరీదైనందున, తక్కువ ధరకు గృహ గ్యాస్‌ను బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఈ అక్రమ సరఫరా కారణంగా హోటళ్లలో టీ, టిఫిన్ ధరలు గణనీయంగా పెరిగాయి. ఖర్చు తగ్గినా, వినియోగదారులపై అధిక ధరల భారం మోపడం గమనార్హం. ప్రజలపై భారమై మారిన అక్రమాలు. గ్యాస్ సరఫరాలో అక్రమాలు పెరగడం వల్ల నిజంగా అవసరమున్న గృహ వినియోగదారులకు సిలిండర్లు ఆలస్యంగా అందుతున్నాయి. కొన్నిసార్లు కొరత కూడా ఏర్పడుతోంది. దీంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం పై విమర్శలు..** ఈ వ్యవహారం పై రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది, స్థానికంగా జరుగుతున్న ఈ అక్రమాలు అధికారుల కంటపడకపోవడం ఆశ్చర్యంగా మారింది. గ్యాస్ ఏజెన్సీలపై విచారణకు డిమాండ్..గ్యాస్ ఏజెన్సీలు, డెలివరీ సిబ్బంది పాత్రపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా గృహ గ్యాస్‌ను కమర్షియల్ వినియోగానికి మళ్లించే వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. తక్షణ చర్యలే పరిష్కారం, ఈ అక్రమాలను అరికట్టేందుకు అధికారులు తక్షణమే ఫీల్డ్‌లోకి దిగాలి. గ్యాస్ సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ పెంచి, బ్లాక్ మార్కెట్‌ను పూర్తిగా అరికట్టాలి. లేకపోతే భవిష్యత్తులో ఇది మరింత పెద్ద సమస్యగా మారే అవకాశముంది...

# టీటీడీ బోర్డు కీలక నిర్ణయాలు

### ధూప-దీప నైవేద్యాల నిధుల పెంపు
### అలిపిరిలో శాశ్వత యాగశాల నిర్మాణం



**తిరుపతి: మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. బుధవారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భక్తుల సౌకర్యాలు, ధార్మిక కార్యక్రమాల విస్తరణ, విద్యా-వైద్య రంగాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు ఆమోదం పొందాయి. ప్రధానంగా రాష్ట్రంలోని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాల కోసం ప్రస్తుతం ఇస్తున్న రూ.5 వేల నిధిని రూ.10 వేల వరకు పెంచాలని నిర్ణయించారు. అలాగే సనాతన ధర్మ ప్రచారం కోసం "అక్షర గోవిందం" కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నారు. తిరుపతిలోని అలిపిరి వద్ద శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం కోసం రూ.4.75 కోట్లతో శాశ్వత యాగశాల నిర్మాణానికి ఆమోదం లభించింది. భక్తుల సౌకర్యాల దృష్ట్యా తిరుమల సర్వదర్శనం క్యూలైన్లలో రూ.4.55 కోట్లతో అదనపు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. టీటీడీ విద్యాసంస్థల అభివృద్ధికి ఇప్పటికే కేటాయించిన నిధులకు అదనంగా రూ.43.40 కోట్లు మంజూరు చేసి మొత్తం రూ.161.40 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. అలాగే తిరుమలలో నీటి వృథాను నివారించేందుకు గోగర్భం డ్యామ్ నుండి ఫిల్టర్ ప్లాంట్ వరకు పైపులైన్ ఏర్పాటుకు రూ.6 కోట్లు కేటాయించారు. అలాగే తిరుమలలోని రహదారులు, సర్కిళ్లకు ఆధ్యాత్మిక ప్రాశస్త్యం గల పేర్లు పెట్టాలని నిర్ణయించారు. వివిధ ఆలయాల అభివృద్ధికి గోపురాలు, మండపాలు, పుష్కరిణులు నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులు ఆమోదించారు. ఇతర ముఖ్య నిర్ణయాల్లో భాగంగా నవీ ముంబైలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహా సంప్రోక్షణకు సన్నాహాలు, ఖమ్మంలో ఆలయ నిర్మాణానికి భూమి స్వాధీనం, లేపాక్షిలో కల్యాణ మండపం నిర్మాణం, కాంట్రాక్ట్ ఉద్యోగులకు దర్శనం, లడ్డూ కార్డుల జారీ వంటి అంశాలు ఉన్నాయి. టీటీడీ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ కింద అదనంగా రూ.2 లక్షల రీయింబర్స్‌మెంట్ కల్పించాలని నిర్ణయించారు. వినికిడి లోపం ఉన్న 150 మంది పిల్లలకు ఉచితంగా వినికిడి యంత్రాలు ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో శ్రీఎం రవిచంద్ర, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# అల్లుడికి బడిత పూజ చేసిన మామ..!

### అక్రమ సంబంధం రెడ్ హ్యాండెడ్‌గా బట్టబయలు..!
### మచిలీపట్నంలో కలకలం రేపిన ఘటన.



**మచిలీపట్నం మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కుటుంబ బంధాలను విచ్ఛిన్నం చేసే అక్రమ సంబంధం మరోసారి సంచలనం సృష్టించింది. అల్లుడు చేసిన మోసాన్ని తట్టుకోలేక మామ బహిరంగంగా నిలదీయడంతో మచిలీపట్నంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏలూరుకు చెందిన జయప్రకాశ్ నారాయణకు విజయవాడకు చెందిన లిఖితతో సుమారు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. జయప్రకాశ్ బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తుండగా, లిఖిత గృహిణిగా ఉంది. కొంతకాలం వరకు అన్యోన్యంగా సాగిన వారు దాంపత్య జీవితం, అనంతరం విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో పని ఒత్తిడి తో భార్యను పుట్టింటికి పంపించిన జయప్రకాశ్, తరువాత ఆమెను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం ప్రారంభించాడు. అల్లుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన మామ, అతని కదలికలపై నిఘా పెట్టాడు. ఈ క్రమంలో జయప్రకాశ్ మచిలీపట్నంలో దివ్యజ్యోతి అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడనే విషయం



తెలుసుకున్నాడు. దీనిని నిర్ధారించుకున్న మామ, అల్లుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు ప్రణాళిక రచించాడు. స్థానిక సుల్తాన్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో దివ్యజ్యోతి కూతురి ఓణీల వేడుక జరుగుతుండగా, అక్కడికి చేరుకున్న మామ అల్లుడిని బహిరంగంగా నిలదీశాడు. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామంతో వేడుకలో గందరగోళం నెలకొంది. అల్లుడి అక్రమ సంబంధం బయటపడటంతో అక్కడున్న అతిథులు షాక్‌కు గురయ్యారు. మీడియా, పోలీసులు చేరుకునేలోపే జయప్రకాశ్ అక్కడి నుంచి పరారయ్యాడు. "తన కూతురి జీవితాన్ని నాశనం చేసి, వేరే మహిళతో వేడుకలు జరుపుకుంటాడా?" అంటూ మామ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూతురికి న్యాయం చేయాలని వేడుకుంటూ అల్లుడిని కాళ్లు పట్టుకుని నిలదీయడం హృదయ విదారకంగా మారింది. ఈ ఘటనపై బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

## సునంద డయాగ్నస్టిక్ సెంటర్ కొండేటి వీరయ్య ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం

### వందమందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు 30 మందికి కళ్ళజోళ్ళ పంపిణీ





**కలిదిండి మే 6 (వార్తా ప్రభ)** పేదలకు ఆరోగ్య సేవలు చేరవేయాలనే లక్ష్యంతో కలిదిండి ప్రాంతంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విశేష స్పందనను అందుకుంది. సునంద డయాగ్నస్టిక్ సెంటర్ అధినేత కొండేటి వీరయ్య ఆధ్వర్యంలో, భీమవరం రాధాకృష్ణ నేత్రాలయం మరియు సునంద మెడికల్ డయాగ్నస్టిక్ సర్వీస్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 20 మంది రోగులను ఉచిత కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అలాగే 30 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం జరిగింది. అదనంగా రక్త పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించి, గ్రామ ప్రజలకు సమగ్ర వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా వృద్ధులు, నిరుపేదలు పెద్ద ఎత్తున లాభపడటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

## కేడిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




**పెనుగంచిప్రోలు, మే 6( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లోని కేడీసీసీ బ్యాంకు వద్ద ఈ బ్రాంచ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు.. బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం సూచనల మేరకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని బ్యాంక్ చీఫ్ మేనేజర్ పారుపల్లి దుర్గాప్రసాద్ తెలిపారు, ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు సొసైటీ చైర్ పర్సన్ కర్ల వెంకటనారాయణ, అత్తులూరి అచ్యుతరావు (అనిగండ్ల పాడు ) ఉమ్మినేని పుల్లారావు ( ముల్లపాడు ) వేముల వెంకటేశ్వరరావు ( తోటచర్ల ) పొందూరు నాగయ్య ( గుమ్మడి దుర్రు ) జీ. పరుశురాం ( కొల్లికోళ్ళ ) నెట్టెం దుర్గా భవాని ( కొనకంచి ) శ్రీ మతి బి. సునీత ( నావాబుపేట ) లంకా బాలాజీ ( శనగపాడు ) శ్రీ తిరుపతమ్మ దేవస్థానం ఉత్సవ కమిటీ మాజీ సభ్యుడు రమేష్ బాబు, జిల్లేపల్లి సుధీర్ బాబు కాకాని శ్రీనివాసరావు నలమోలు శివరాం ప్రసాద్, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బోళ్ల రవికుమార్,కొలిపాక బ్రహ్మం సహకార సంఘాల కార్యదర్శులు బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చందా మురళీకృష్ణకు రూ.3.57 లక్షలు మంజూరు

### ఫలించిన పజ్జూరు విజయ్, పజ్జూరు రామారావు ప్రయత్నం



**జి.కొండూరు: మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామానికి చెందిన చందా మురళీకృష్ణకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3,57,503లు మంజూరయ్యాయి. ఈ సాయాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం చెక్కు రూపంలో అందజేశారు. చందా మురళీకృష్ణ కుమారుడు చందా ప్రణీత్ గతంలో అనారోగ్యానికి గురై మృతి చెందాడు. అనారోగ్యాన్ని గురైన సందర్భంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చిన్నారి చికిత్స పొందాడు. దీనికి సంబంధించి వైద్య సేవలు, చికిత్స నిమిత్తం అతని తండ్రి చందా మురళీకృష్ణ ఖర్చు చేశాడు. ఈ విషయమై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ని జి.కొండూరు గ్రామ పార్టీ అధ్యక్షులు పజ్జూరు విజయ్ ని సంప్రదించారు. దీంతో సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరు చేయాలని ఎమ్మెల్యే సీఎం చంద్రబాబు కి, మంత్రి లోకేష్ కి సిఫారసు చేశారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి చందా మురళీకృష్ణకు రూ.3,57,503లు చెక్కు రూపంలో ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. ఈ సందర్భంగా చందా మురళీకృష్ణ అతని కుటుంబ సభ్యులు,స్థానిక తెదేపా నాయకులకుఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా న్యాయ సేవాధికార సంస్థకే వన్నెతెచ్చిన న్యాయమూర్తి రామకృష్ణయ్య

**కృష్ణా జిల్లా జడ్జి జి. గోపి.**



**మచిలీపట్నం మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి కె.వి రామకృష్ణయ్య మచిలీపట్నం నుండి కర్నూలు బదిలీ అయిన సందర్భంగా మచిలీపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణా జిల్లా జడ్జి గోపి మాట్లాడుతూ గత 40 నెలలుగా కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య విస్తృతమైన సేవలు అందించి పదవికే వన్నె తెచ్చారని అన్నారు. ఆయన హయాంలో కృష్ణా జిల్లాకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందని అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశాలను చట్టం పట్ల అవగాహన క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందించడంలో రామకృష్ణయ్య విజయం సాధించారని అన్నారు. రామకృష్ణయ్య తో తన ఏడాది అనుబంధం సోదర భావాన్ని పెంపొందించిందని గోపి అన్నారు. ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సింది అధికారం అంటే అజమాషీ కాదని అధికారం అంటే సేవతో కూడిన సర్వీస్ అని అన్నారు. విజయవాడ తో సహా జిల్లాలోని అన్ని కారాగారాలను ఆకస్మిక తనిఖీలు చేస్తూ ఖైదీల హక్కులు రక్షించడంలో రామకృష్ణయ్య ఎనలేని కృషి చేశారని అన్నారు. కృష్ణాజిల్లాలో తాను చేసిన పదవీకాలం తన సర్వీసులో తీపి గుర్తుగా మిగిలిపోతుందని రామకృష్ణయ్య అన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ కృష్ణా జిల్లా ఎస్పీ న్యాయవాదులు న్యాయమూర్తులు అందించిన సహాయ సహకారాలతో గత నలభై నెలలుగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ప్రతి ఒక్కరికి రామకృష్ణయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. న్యాయ సేవాధికార సంస్థ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా ఇచ్చిన సహకారం మరువలేనిదని అన్నారు.సీనియర్ న్యాయవాది బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ రామకృష్ణయ్య తన పదవీకాలంలో వేలాది కేసులను పరిష్కరించి రాష్ట్రస్థాయిలో కృష్ణా జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. బెంచ్ మరియు బార్ మధ్య సంబంధాలను మరింత బలపడే విధంగా రామకృష్ణయ్య కృషి చేశారని అన్నారు. అజ్మతున్నీసా బేగం మాట్లాడుతూ రామకృష్ణయ్య తన పదవీకాలంలో "విక్టిమ్ కాంపెన్సేషన్ చట్టం" ప్రకారం రెండు కోట్ల రూపాయలు బాధితులకు అందించి రికార్డు నెలకొల్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు అదనపు సీనియర్ సివిల్ జడ్జి చదలవాడ యుగంధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి సాయి సుధా, మొబైల్ మెజిస్ట్రేట్ జొన్నలపల్లి బాల త్రిపుర సుందరి దేవి, రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. దేవస్థా దీపిక, సంస్థ సూపరింటెండెంట్ చిట్టూరి జయశ్రీ దేవి, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఓ.ఎస్. కే శివకుమార్ పలువురు న్యాయవాదులు న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా జడ్జి జి. గోపి, న్యాయమూర్తులు న్యాయవాదులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది రామకృష్ణయ్య ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

## కళాకారులకు చేయూత... కొండపల్లి బొమ్మలకు కొత్త దిశ

**- ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ లక్ష్మీశ**



**ఇబ్రహీంపట్నం, మే 06(వార్తా ప్రభ ప్రతినిధి):** జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలోని కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఇటీవల నిర్వహించిన కొండపల్లి బొమ్మల ఉత్సవం ఘన విజయం సాధించిన నేపథ్యంలో హస్తకళాకారులు సరికొత్త ఉత్సాహంతో వినూత్న డిజైన్లతో కళాత్మక వైభవాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో నిరంతర పర్యవేక్షణ, కళాకారులను ప్రోత్సహించే క్రమంలో కలెక్టర్ లక్ష్మీశ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించి, కళాకారులతో ముచ్చటించారు. సంప్రదాయ కళను ఆధునికతతో మేళవిస్తూ కొత్త డిజైన్లు రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. హస్తకళాకారుల ప్రగతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించిన కలెక్టర్, మార్కెట్ విస్తరణకు అవసరమైన సాంకేతిక సహాయం, ప్రోత్సాహం అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు. కొండపల్లి బొమ్మలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు

**కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమష్టిగా కృషిచేయాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.**



**విస్సన్న పేట, మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈ నెల 9వ తేదీన ఎ.కొండూరు మండలం మాధవరంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని.. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు.బుధవారం స్థానిక స్వర్ణ గ్రామం కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్ తో కలిసి రెవెన్యూ, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, వ్యవసాయం, ఉద్యానం, రవాణా, సర్వే, పోలీసు తదితర సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రీసర్వే పూర్తయిన భూముల రైతులకు రాజముద్రతో పట్టాలు అందించే కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి పాల్గొంటారని.. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. కార్యక్రమ వేదిక, అతిథులు కూర్చునే ఏర్పాట్లు, ప్రజల కోసం తగిన షెడ్లు, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లు, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో ఎలాంటి లోటు ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వీఐపీ రాకపోకల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మార్గమధ్యంలో తగిన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. వాస్తవ ప్రగతిని ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరోగ్య శాఖ అధికారులు అత్యవసర వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఫైర్ సర్వీసులు, విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణంలో సూచిక బోర్డులు, దిశా నిర్దేశకాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం కార్యక్రమం జరిగే ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను త్వరితగతిన ఏర్పాట్లను పూర్తిచేసేలా దిశానిర్దేశం చేశారు.



## ఖరీఫ్ నాటికి సాగునీటి కాలువల పనులు పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**



**మచిలీపట్నం మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి):**జిల్లాలో వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి సాగునీటి, మురుగు కాలువల్లో తూడు, పిచ్చి మొక్కలు తొలగింపు, పూడికతీత, మరమ్మతు పనులను తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు.బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో జలధార -- జల హారతి కార్యక్రమం పురోగతి, అలాగే సాగునీటి కాలువల పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ జలాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార -- జల హారతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో నీటి రీచార్జ్ షాఫ్ట్‌లను ఏర్పాటు చేయాలని, భూగర్భ జలమట్టం తక్కువగా ఉన్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించి అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు.సాగునీటి కాలువల పనులకు సంబంధించి మాట్లాడుతూ, గుర్రపు డెక్క, తూడు, పిచ్చి మొక్కల తొలగింపు, పూడికతీత, మరమ్మతు పనులను సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పని రైతుల సమక్షంలోనే జరగాలని, పనులు పూర్తయ్యాక స్థానిక రైతుల నుంచి ధృవీకరణగా సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. తాను క్షేత్రస్థాయి పర్యటనలకు వచ్చినప్పుడు రైతులతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడతానని, పనులు జరగలేదని రైతులు చెబితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.సమావేశంలో జలవనరుల శాఖ ఎస్ఈ గుణకర్, డ్వామా పీడీ ఎన్ శివప్రసాద్ యాదవ్, కేసి డివిజన్ ఈఈ రవి కిరణ్, డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగలే..దొంగ దొంగ అని అరిచారు

**మాఫియాలో అంతర్గత కుట్రలు**

**- కేసులో ఇరుకున్న ఇద్దరు మాఫియా డాన్ లు, ఒక రైస్ మిల్లర్**



**ఇబ్రహీంపట్నం, మే 6 (వార్తా ప్రభ ప్రతినిధి):** అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం బస్తాలను పట్టించాలనుకున్న మాఫియా డాన్ కూడా పోలీసులకు పట్టుబడ్డాడు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన ఘటనలో ముగ్గురిపై పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఇందులో ఇద్దరు రేషన్ మాఫియా డాన్ లు, రేషన్ మిల్లర్ ఒకరు ఉన్నారు. రేషన్ మాఫియా డాన్ లు బత్తుల దుర్గారావు, దేరంగుల గోపి ఈ నెల ఒకటి నుంచి 4వరకు గుట్టుగా రేషన్ బియ్యం కొనుగోలు చేశారు. మొత్తం 550 రేషన్ బియ్యం (26420 కిలోలు) బస్తాలను కొండపల్లి శాంతి నగర్ లోని అభినందన ప్లాట్స్ లో నిల్వ చేశారు. మరికొన్ని బస్తాలను కూడా ఇక్కడికి తరలించి ఒకేసారి రాత్రివేళ లారీలో ఎగుమతి చేసి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో రేషన్ మాఫియా డాన్ దేరంగుల గోపిని పోలీసులకు పట్టించేందుకు మరో రేషన్ మాఫియా డాన్ బత్తుల దుర్గారావు పథకం పన్ని తన అనుచరులతో పోలీసులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యం నిల్వ చేసిన ప్రాంతానికి చేరుకున్న పోలీసులకు దేరంగుల గోపి వాహనంతో సహా పట్టుబడ్డాడు. అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా పట్టుబడిన రేషన్ బియ్యంలో తనవి కొన్ని ఉంటే బత్తుల దుర్గారావు కు చెందిన బియ్యం బస్తాలు కూడా ఉన్నాయని పోలీసులకు తెలిపాడు. అతన్ని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఇద్దరు నిల్వ చేసినట్లు తేలింది. దీంతో దేరంగుల గోపి, బత్తుల దుర్గారావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. బియ్యం నిల్వ ఉంచిన ప్లాట్స్ కు సమీపంలో రైస్ మిల్ ఉండటంతో రైస్ మిల్లర్ బొర్రా సురేష్ ను అనుమానించిన పోలీసులు అతన్ని కూడా అదుపులోకి తీసుకుని విచారించారు. ఇందులో తన ప్రమేయం ఉందని అతను అంగీకరించడంతో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విధంగా రేషన్ మాఫియా అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతూనే ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.

## వాణిజ్య పన్నుల శాఖ సుస్థిర ప్రగతి... సీఎస్‌కు సంఘాల సమగ్ర నివేదిక

**- అహ్మద్‌బాబు పనితీరుకు ఉద్యోగుల సంపూర్ణ మద్దతు**



**విజయవాడ, మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వాణిజ్య పన్నుల శాఖలో అహ్మద్ బాబు పనితీరుకు ఉద్యోగులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలోని వివిధ సంఘాల ప్రతినిధులు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి శాఖలో నెలకొన్న పరిస్థితులతో పాటు పరిపాలన, అభివృద్ధి అంశాలను సమగ్రంగా వివరించారు. అహ్మద్‌బాబు పనితీరు పట్ల పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. వాణిజ్య పన్నుల శాఖలో అహ్మద్ బాబు బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్ని కేడర్లలో పదోన్నతులు కల్పించడం జరిగిందని.. ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ సెంటర్ ద్వారా పన్నుల వసూళ్లను గణనీయంగా పెంచి రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో శాఖను ముందంజలో నిలిపినట్లు సీఎస్‌కు తెలియజేశారు. శాఖలో పరిపాలన పారదర్శకంగా, సవ్యంగా కొనసాగుతోందని.. ఒక సంఘం తప్ప మిగతా అన్ని సంఘాలు ఏకగ్రీవంగా ప్రభుత్వానికి, ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ కమిషనర్ కు ఇదే విషయాన్ని వివరించినట్లు తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొంతమంది ఉద్యోగులు, అధికారులను ఇబ్బందులకు గురిచేస్తూ శాఖ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నించడాన్ని అన్ని సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయి. తల్లి లాంటి వాణిజ్య పన్నులు శాఖను రోడ్డుమీదకు తీసుకురావడం వంటి చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా వాణిజ్య పన్నుల శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు తోట రాజశేఖర్, ఎస్సీ ఙ ఎస్టీ ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షులు నిర్మల జ్యోతి, జీఎస్టీ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పురుషోత్తమ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల కళ్యాణ్ కుమార్, ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కన్వీనర్ రాజ్యలక్ష్మి, ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. వేణుగోపాల్ పాల్గొన్నారు.

## రైతే రాజు.. రైతు బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం

**రైతు సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాల బలోపేతం : మల్లారెడ్డి**

**శామీర్ పేట మే 06:(వార్తా ప్రభ ప్రతినిధి)** రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని, రైతు బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని మాజీ మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో భాగంగా "సహకార భావం -- రైతు బలం" కార్యక్రమం షామీర్పేట రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రైతు సంక్షేమానికి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, చెరువుల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వంటి పథకాల ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు రాజుగా ఎదగాలని, రైతు కుటుంబం ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిరంతరం పనిచేసిందని తెలిపారు.షామీర్పేట ప్రాంతం ఒకప్పుడు ద్రాక్ష తోటలకు ప్రసిద్ధి చెందిందని, మళ్లీ ఆ పూర్వ వైభవాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కమర్షియల్ పంటలు, అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ -- పట్టణ అవసరాలకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు శిక్షణ అవసరమన్నారు.మూడు చింతలపల్లిలో నాలుగు ఎకరాల్లో గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా షామీర్పేట, మేడ్చల్ ప్రాంతాల్లో రైతుల కోసం సహకార సంఘాల ఆధ్వర్యంలో గోదాములు, కోఆపరేటివ్ భవనాలు నిర్మించామని చెప్పారు.

## నిబద్ధతగా జనగణన....



**గుడ్లవల్లేరు: మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జనగణనను ఎంతో నిబద్ధతతో నిర్వహించాలని ఎంపీడీఓ ఎండి ఇమ్రాన్ అన్నారు. మండలంలోని కౌతవరం గ్రామంలో చేస్తున్న జనగణన కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. జనగణన చేసే విధానాన్ని గమనించి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా చేయాలని ఆదేశించారు. తదనంతరం గుడ్లవల్లేరు గ్రామంలో సెక్రటేరియట్ --2 లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అన్ని రికార్డులను గమనించి బాధ్యతగా చేయాలని సిబ్బందికి తగు సూచనలు అందజేశారు.

## చలివేంద్రం ప్రారంభించిన చైర్మన్ చిట్టిబాబు




**ఇబ్రహీంపట్నం, మే 06(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బ్యాంక్ సెంటర్ లో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాసవి క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కొండపల్లి పురపాలక చైర్మన్ మరియు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ వేసవి కాలం పాదచారులకు, వాహనదారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయుక్తకరంగా ఉంటుందని అన్నారు.వేసవి కాలంలో ప్రజలకు చల్లని తాగునీరు అందించడం ఎంతో అవసరమని, వాసవి క్లబ్ వంటి సేవా సంస్థ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమం లో మైలవరం జనసేన ఇన్చార్జి అక్కల రామ్మోహన్ రావు (గాంధీ), వైఎస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కొండపల్లి మునిసిపాలిటీ అధ్యక్షులు కరిమికొండ బాలాజీ,జి.హరికృష్ణ, బ్రహ్మాజీ ,అఫ్సర్, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాసవి క్లబ్ సభ్యులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 50వ రోజు కొనసాగుతున్న యూత్ టైం బ్యాంక్ సేవలు






**విజయవాడ, మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశా ఐఏఎస్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యూత్ టైం బ్యాంక్ సేవలు 50వ రోజు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో నిర్విరామంగా కొనసాగుతున్నాయని యు వజన సర్వీసుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యని ర్వాహణాధికారి మరియు ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు.ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సిబ్బంది కొరత రీత్యా యూత్ టైం బ్యాంక్ సర్వీసులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేక దృష్టితో మార్చి 16వ తేదీన ప్రారంభించారు. అప్పటినుండి ఈరోజు వరకు నిర్విరామంగా యూత్ టైం బ్యాంక్ సేవలు రోజుకి ఒక కాలేజ్ చొప్పున 30 నుంచి 40 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు టైం బ్యాంక్ సేవలో పాల్గొని వయోవృద్ధులకు, వికలాంగులకు, నడవలేని వారికి మరియు నిరక్షరాస్యులకు వారు హాస్పిటల్ ఆవరణంలోకి వచ్చిన వెంటనే వారికి ఓపిడి తీసి ఇవ్వడం, డాక్టర్ ను సంప్రదించడం, టెస్టులు చేయించడం మందులు తీసి ఆటో ఎక్కిచ్చేంత వరకు పేషెంట్ కి యూత్ టైం బ్యాంకు వాలంటీర్లు తోడుగా ఉండి వారికి వెచ్చించిన టైంను యూత్ టైం బ్యాంకులో నమోదవుతుంది. ఈ రోజు ఎస్ ఆర్ కె ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు ఎస్ ఆర్ ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్, ఎన్జీవో క్యాంపస్ నావిగేషన్ వాలంటీర్లు మరియు వాసవి మహిళా మండలి వాలంటీర్లు వాలంటీర్లు 65 మంది సేవలు అందించారు. ఈ సేవలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేసినవారికి కలెక్టర్ మెరిట్ సర్టిఫికెట్ కూడా ఇస్తున్నారు. ఇలాంటి సేవలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఎన్జీవోలు భాగస్వామ్యం పొందాలని మరియు డిగ్రీ విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు, ఇంటెన్షిప్, అప్రియెంటెన్షిప్ చేయదలచుకున్న వారు యూత్ టైం బ్యాంకు ఉపయోగించుకోవాలని వారి పని గంటలు పూర్తి అయిన తర్వాత వారికి కలెక్టర్ గారిచే సర్టిఫికెట్ ఇస్తామని, ఈ సేవలు ఉపయోగించుకోవడం వల్ల పేషంట్లకు, కళాశాలకు, జిల్లాకు మంచి పేరు వస్తుందని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. 50 రోజులలో ఈ సేవలను 1682 మంది వాలంటీర్లు, 3901 మంది పేషెంట్లకు మరియు 6448 గంటలు సేవలందించారు. ఈ సేవలను చేయదలుచుకున్నవారు ముఖ్యకారి నిర్వాహణాధికారి, యువజన సంక్షేమ శాఖ ఎన్టీఆర్ జిల్లా మొబైల్ నెంబర్ ను 9849909069 సంప్రదించవచ్చని తెలిపారు.

# ఘనంగా కొలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**తరలివచ్చిన కాంగ్రెస్ అగ్రశ్రేణి నాయకులు**





**కుత్బుల్లాపూర్, మే 6, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగాయి. అభిమానులు, నాయకులు మరియు కార్యకర్తల భారీ సమక్షంలో ఆయన తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు.

**వెల్లువెత్తిన శుభాకాంక్షలు**హన్మంత్ రెడ్డి నివాసం వద్ద ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ నలుమూలల నుండి తరలివచ్చిన కార్యకర్తలు ఆయనకు పూలమాలలు వేసి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడుతూ, ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, డిసిసి మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, టిపిసిసి ప్రొటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిశోర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు అంజలి యాదవ్, జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి. వీరితో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, సర్పంచ్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు మహిళా నాయకురాలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# హైడ్రా ప్రజావాణికి 4 వారాల విరామం

**పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు**

**హైదరాబాద్, మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజావాణికి 4 వారాల పాటు విరామాన్ని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు ప్రకటించారు. వేలాదిగా వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తున్నామని.. మిగిలి ఉన్నవి కూడా క్లియర్ చేసేందుకే 4 వారాలు విరామాన్నిచ్చినట్టు బుధవారం హైడ్రా కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 8వ తేదీ నుంచి యథావిధిగా హైడ్రా ప్రజావాణి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజావాణితో పాటు.. వివిధ రూపాల్లో వచ్చిన ఫిర్యాదులన్నీ క్లియర్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ విరామన్ని ప్రకటించినట్టు తెలిపారు. అయితే గతంలో ఇచ్చిన ఫిర్యాదుదారులు అత్యవసరమని భావిస్తే కార్యాలయానికి వచ్చి నేరుగా కలవచ్చన్నారు. అలాగే ముఖ్యమైన సమస్యలున్నా నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

# పేదల సొంతింటి కల స్వప్నమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**రాజన్న సిరిసిల్ల, మే 05::**(వార్తా ప్రభ ప్రతినిధి) పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.వేములవాడ రూరల్ మండలం నాగయ్య పల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు.

# రామగుండం నవ నిర్మాణానికి ప్రజలే భాగస్వాములు!!

- పరిశుభ్రతే అభివృద్ధి పునాది
- ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 6 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నవ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎం ఎల్ ఏ. ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. వార్డు సందర్శనలో భాగంగా బుధవారం 31 వ డివిజన్ భీముని పట్నం, ఆటో నగర్ లో నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి పర్యటించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ, నవ నిర్మాణంలో భాగశీగా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గత కొన్ని రోజులుగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టడం అభినందనీయమని అన్నారు. గత 20 ఏళ్లుగా కాలువల్లో పూడిక తీయకపోవడంతో వర్షాకాలంలో వరద నీరు ఇళ్ళలోకి వస్తున్నదని అన్నారు. కాలువలో చెత్త వేయడం మానుకోవాలని అన్నారు. ఇంటిని ఉంచుకున్నంత పరిశుభ్రంగా పరిసరాలను కూడా ఉంచుకోవాలని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. మురికివాడ రహితంగా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ సంధర్బంగా డివిజన్ లోని



మేజర్ కాలువలలో యంత్రాలు, మనుషులతో పూడిక తొలగించి శుభ్రం చేశారు. కాలువల్లో పెరిగిని చెట్ల పొదలను తొలగించారు. స్థానిక కార్పొరేటర్ షాహెదా, నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకటస్వామి, ఎస్ఇ గురువీర, టి పి ఎస్ నవీన్, డి.ఇ షాబాజ్ , ఎఇలు జమీల్, తేజస్విని , సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# చీఫ్ సెక్రటరీ ని కలిసిన ఏ.పి.ఎన్.జి.జి.ఓ. నేతలు

**నూతనంగా ఏర్పాటు చేసిన మూడు కొత్త జిల్లా కేంద్రాలలో 16% హెచ్ ఆర్ ఎ కోసం అభ్యర్థన**





**అమరావతి, మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వెలగపూడి సచివాలయంలో ఈరోజు ఏపీ ఎన్జీవో రాష్ట్ర సంఘ అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎన్ జి జి ఓ నేతలు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ ని కలిసి ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ అంశాలపై వినతి పత్రాలను అందజేశారు. ముఖ్యంగా ఇటీవల నూతనంగా లిఏర్పాటు చేసిన మార్కాపురం రంపచోడవరం పోలవరం జిల్లా కేంద్రాలలో ఉద్యోగులందరికీ కూడా 16% హెచ్ ఆర్ ఏ ఇవ్వాల్సిందిగా రిప్రజెంటేషన్ ఇవ్వటం జరిగింది. అంతకుముందు ఏర్పాటుచేసిన ప్రతి జిల్లా కేంద్రాలలోనూ ఉద్యోగులకు 16% వర్తిస్తుంది. దాని ప్రకారం నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్రాలలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉపాధ్యాయులకు కూడా 16 శాతం ఇంటి అద్దె ఎలవెన్సులను నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా అభ్యర్థించడం జరిగింది. ఈ విషయంలో తక్షణమే స్పందించిన చీఫ్ సెక్రటరీ గారు సత్వరమే నిర్ణయం తీసుకునే దిశలో చర్యలు ఉంటాయని ఉద్యోగ సంఘాల నాయకులకు తెలియజేశారు. ఉద్యోగులకు సంబంధించిన అన్ని అంశాలలో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కార్యక్రమాలను నిర్మాణాత్మకమగ ప్రజల ముంగిటకు తీసుకెళ్లడానికి ఉద్యోగులంతా కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీజివో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్, , రాష్ట్ర కార్యదర్శి రజనీష్ బాబు, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు , విజయవాడ సిటీ ప్రెసిడెంట్ సివిఆర్ ప్రసాద్ , క్యాపిటల్ సిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీలిసిహెచ్ శ్రీధర్ , పాల్గొన్నారు

# అతుకులు లేని జాతీయజెండా తయారుచేసిన చేనేత కళాకారుడు

**రామలింగ సత్యనారాయణను అభినందించిన మంత్రి లోకేష్**





**అమరావతి: మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అశోక చక్రంతో సహా ఎటువంటి అతుకులు లేని జాతీయ జెండాను 8ఇ12 సైజులో తయారుచేసి పలు అంతర్జాతీయ రికార్డులు సాధించిన పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరం గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు రుద్రాక్షల రామలింగ సత్యనారాయణ రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ ను ఉండవల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ టాలెండ్ అవార్డు, భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం సాధించిన రామలింగ సత్యనారాయణ... తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఎగురవేసే 6ఇ12 జెండాను, తర్వాత ఎర్రకోటపై ఎగురవేసే 8□12 జాతీయ జెండాలను తయారుచేశారు. జాతీయ పతాక రూపశిల్పి శ్రీ పింగళి వెంకయ్య స్ఫూర్తితో తాను తయారు చేసిన జాతీయజెండా ఒక్కసారైనా ఎర్రకోట పై ఎగరాలి, భారత దేశంలోనే అత్యంత అరుదైన ఏకవస్త్ర చేనేత జాతీయ జెండాగా మన ఆంధ్రప్రదేశ్ కి గుర్తింపు రావాలన్నదే తన ఆకాంక్షగా రామలింగ సత్యనారాయణ చెప్పారు. ఇది ప్రపంచంలోనే అత్యంత అరుదైన చేనేత జాతీయ జెండా ఏకరీతిగా అశోక్ చక్రంలో దారాల అల్లిక చాలా కష్టమైనది. చిన్న పొరపాటు వచ్చినా మరలా మొదటి నుంచి అల్లిక ప్రారంభించాలి. అందుకనే ఎక్కువ సమయం (సుమారు 6 నెలలు) తీసుకుంటుంది. అన్నీ సజావుగా సాగితే తొందరగా పూర్తి అవుతుందని అన్నారు. జాతీయ జెండాలోని అశోకచక్రం నేతలో రావాలంటే 1200 గళ్ళు గ్రాఫ్ అవసరం. ఒక్క గడి తేడా లేకుండా, మూడు రంగుల దారాలు ఒకదానికి మరొకటి కలవకుండా లింక్ వేసుకుని నేయాల్సి ఉందని తెలిపారు. తన మనసుకు దగ్గరైన చేనేతతో అతుకులులేని జాతీయ జెండా తయారుచేసిన రామలింగ సత్యనారాయణ కృషిని మంత్రి లోకేష్ అభినందించారు.

# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి

**శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కు శాసనసభ్యులు గాంధీ సూచన**



**శేరిలింగంపల్లి,మే 6 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు,అభివృద్ధి పనులపై జోనల్ కార్యాలయంలో పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మున్సిపల్ కమిషనర్ జి.సృజన, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి తో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యల నివారణకు లింక్ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని కోరారు.అపర్ణా హిల్ పార్క్--గంగారాం చెరువు మార్గం, ఎన్ హెచ్-65 నుండి శ్రీదేవి థియేటర్ రోడ్ వరకు లింక్ రోడ్లను ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు.చందానగర్, బొటానికల్ గార్డెన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం అవసరమని పేర్కొన్నారు.అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, సీసీ రోడ్లు,నాలాల విస్తరణ, పూడిక తీత చేపట్టాలని సూచించారు.పటేల్ చెరువు, గంగారాం చెరువు తదితర చెరువుల సుందరీకరణ,పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.కమిషనర్ సృజన ఐఏఎస్ సమస్యలపై సానుకూలంగా స్పందించారు.

# పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి..

**సిపిఐ మండల కార్యదర్శి కోమరి హనుమంతరావు**






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించి షరతులు లేకుండా అందించాలని సుజాతనగర్ సిపిఐ మండల కార్యదర్శి కోమరి హనుమంతరావు ప్రభుత్వాని డిమాండ్ చేశారు బుధవారం సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వంలో పెంచిన నిత్యవసర ధరలతో పేద ప్రజల బతుకు బారంగా మారిందన్నారు కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే దేశవ్యాప్త గా ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు జిల్లా కౌన్సిల్ సభ్యులు తాళ్లూరి పాపారావు మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి ధర్మారావు లావుడియా గోపి సిపిఐ టౌన్ సెక్రటరీ బొడ్డు కేశవరావు నాయకులు దండు నాగేశ్వరావు గడ్డం రాజేందర్ చింతల రమేష్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్‌గా జక్కని అనిత



**హైదరాబాద్, మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్‌గా జక్కని అనిత నియమితులయ్యారు. పద్మశాలి సమాజానికి చెందిన ఆమె, 2010 సంవత్సరం నుండి కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా సేవలు అందించారు. ఈ నియామకానికి సంబంధించి జక్కని అనిత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన శ్రీమతి మీనాక్షి నటరాజన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ గా నియమితులు అయ్యిన జక్కని అనిత మీడియాతో మాట్లాడుతూ హ్యాండ్లూమ్ రంగ అభివృద్ధికి, ముఖ్యంగా హ్యాండ్లూమ్ సంస్థ సంక్షేమానికి కృషి చేస్తానని, సంప్రదాయ వృత్తిని ఆధునిక మార్కెట్‌కు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో నేటి వరకు అండగా ఉండి ప్రోత్సహించిన కుటుంబ సభ్యులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రి కావడం మన ఖర్మ

**● ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని ప్రభుత్వం పట్టించుకోవటం ● ఫీజుల నియంత్రణ చట్టం ఈ నెలలోనే తేవాలి ● 1200 మంది బలిదానాలతో వచ్చిన తెలంగాణలో 12 ఏళ్లుగా ఆ సంవేదనతో పాలన సాగలేదు ● ఉచిత విద్య, వైద్యం మా పార్టీ విధానం ● మాట తప్పితే అమరవీరుల స్థూపం వద్ద రాళ్లతో కొట్టండి ● తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్ : మే 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టటంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా ఫెయిల్ అయ్యిందంటూ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత ఆరోపించారు. ఫీజుల దోపిడీ నియంత్రణకు ఈ నెలలోనే చట్టం తేవాలని ఆమె డిమాండ్ చేశారు. హైదరాబాద్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య - ఫీజుల నియంత్రణ అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో ఆమె పాల్గొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కే కుట్రలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని నియంత్రించాల్సిన ముఖ్యమంత్రే ప్రైవేట్ విద్య సంస్థల ప్రారంభోత్సవాలకు వెళ్తూ వారిని ఎంకరేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రే మన విద్యాశాఖ మంత్రి కావటం ఖర్మ అని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఈనెలలోనే ఫీజు నియంత్రణ చట్టం తేవాలి** ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని ఎట్టి పరిస్థితుల్లో అరికట్టాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫీజు నియంత్రణ కోసం తక్షణమే చట్టం చేయాల్సిందేనని అన్నారు. ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా ఫీజు పెంపు లేకుండా జీవో జారీ చేయాలన్నారు. ఫీజుల పెంపు కారణంగా తల్లితండ్రులకు మే నెల పీడకల మాదిరిగా తయారైందన్నారు. తెలంగాణలో విద్య, వైద్యం కోసమే 60 నుంచి 70 శాతం వరకు వారి ఆదాయాన్ని ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తమ పిల్లలను బాగా చదివించాలన్న తల్లితండ్రుల వీక్ నెస్ ను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ సంస్థలు అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రతి ప్రైవేట్ స్కూల్ లో దాదాపు 50 నుంచి 120 శాతం వరకు ఫీజులు పెంచుతున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం




వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. త్వరలోనే తమతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు. తాము కొత్తగా ఏమీ అడగటం లేదని...రేవంత్ రెడ్డి సర్కార్ గతంలో ఇచ్చిన హామీలనే అడుగుతున్నామన్నారు.

**ఫీజు రీయింబర్స్ మెంట్ ను బొందపెట్టే జీవో నం.7**ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టకపోగా...ఫీజు రీయింబర్స్ మెంట్ ను కూడా బొందపెట్టే కుట్ర ఈ ప్రభుత్వం చేస్తోందని కవిత మండిపడ్డారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఎంఎస్-7 జీవో తో ఫీజు రీయింబర్స్ మెంట్ కు మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పిల్లల అకౌంట్ లో ఫీజు రీయింబర్స్ మెంట్ వేస్తామంటూ జీవో లో పేర్కొన్నారని కవిత చెప్పారు. ఫీజు అకౌంట్ లో వేయకపోయిన సరే పిల్లల తల్లితండ్రులు ఉద్యమం చేయరన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పనిచేస్తుందన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలన్నీ కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తెచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగ్ లో ఉన్న రూ. 11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. బకాయిలు చెల్లించకపోవటంతో కాలేజ్ లు మాతపడుతున్నాయన్నారు. పైగా చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకపోతే అధికంగా నష్టపోయేది ఆడపిల్లలేనని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. చదువుల భారం ఎక్కువైతే కొడుకుల కంటే ముందు కూతుళ్లనే చదువు మాన్పించే పరిస్థితి వస్తుందన్నారు. ఈ విధంగా ప్రభుత్వం ఆడబిడ్డల భవిష్యత్ ను అంధకారంలోకి నెట్టేస్తుందన్నారు.

**హెచ్ పీఎస్ లో అవినీతి చర్యలేవీ?** హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్ పీఎస్) లో అడ్డగోలు అవినీతి జరుగుతోందని కవిత అన్నారు. ఈ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో కొనసాగుతున్న హెచ్ పీఎస్ ఈ ఏడాది 120 శాతం ఫీజు పెంచిందని చెప్పారు. ప్రభుత్వ స్థలంలో కొనసాగే స్కూల్లోనే ఈ పరిస్థితి ఉంటే...చైతన్య, నారాయణ లాంటి స్కూళ్లలో పరిస్థితి ఎలా ఉంటుందని ప్రశ్నించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ఒకే వ్యక్తి గత 14 ఏళ్లుగా అదే పదవిలో కొనసాగుతూ, కొత్తగా వచ్చేవారికి అవినీతి పాఠాలు నేర్పుతున్నారన్నారు. సత్య నాదెళ్ల వంటి పూర్వ విద్యార్థులు ఇచ్చిన విరాళాలకు సంబంధించి ఎలాంటి లెక్క పత్రం లేని పరిస్థితి ఉందన్నారు. దీనికి తోడు ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులైన కొందరు ఏకంగా 30 ఎకరాల క్యాంపస్ భూమిని కబ్జా చేసే పనిలో ఉన్నారన్నారు. హెచ్‌పీఎస్ పనితీరుపై సమగ్ర సమీక్ష జరిపి, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రాళ్లతో కొట్టండి** విద్య, వైద్యం కోసమే తెలంగాణలో ప్రతి కుటుంబం 70 శాతం ఖర్చు చేసే పరిస్థితి ఉందని కవిత అన్నారు. 1200 మంది అమరుల ప్రాణ త్యాగం చేసి...ఎంతో మంది విద్యార్థులు లాఠీ దెబ్బలు తిని రాష్ట్రాన్ని సాధించారని కవిత గుర్తు చేశారు.

# ఆపరేషన్ సింధూర్: భారతదేశ వ్యూహాత్మక వైఖరిని పునర్నిర్వచించిన సంకల్పం

'ఆపరేషన్ సింధూర్' వార్షికోత్సవం గుర్తుంచుకోవాల్సిన తేదీ మాత్రమే కాదు; భారత వ్యూహాత్మక దృక్పథంలో వచ్చిన బలమైన, నిర్ణయాత్మకమైన మార్పుకు ప్రతిబింబం. 2025, మే 7న జరిగిన సంఘటనలు కేవలం విజయవంతమైన ఒక సైనిక చర్య మాత్రమే కాదు. అవి రాజకీయ సంకల్పం, సైనిక సన్నద్ధత, సాంకేతిక సామర్థ్యం, జాతీయ పట్టుదలల కలయికను చాటిచెప్పాయి. అనేక విధాలుగా, సంక్లిష్టమైన, బహుముఖ సవాళ్ల మధ్య భవిష్యత్తులో యుద్ధాలను లేదా సంఘర్షణలను భారత్ ఎలా ఎదుర్కోవాలో చెప్పేందుకు నిర్వచనంగా ఆపరేషన్ సింధూర్ నిలిచిపోతుంది.

ఈ విజయం వెనుక ఉన్న ప్రధాన కారణం తడబాటు లేని రాజకీయ స్పష్టత. దశాబ్దాలుగా, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు భారత్ స్పందించే తీరు తరచుగా స్వయంగా విధించుకున్న పరిమితులకు లోబడే ఉండేది. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సంయమనాన్ని వీడలేదు, కానీ దానిని మరింత మెరుగుపరిచింది. అవసరమైన మేరకే శక్తిని ఉపయోగిస్తూనే, ఒక ఖచ్చితమైన వ్యూహాత్మక సందేశాన్ని శత్రువుకు పంపగలమని భారత్ నిరూపించింది. అదే సమయంలో, అవసరమైతే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసే సామర్థ్యం కూడా ఉందని స్పష్టంగా చాటిచెప్పింది.

రాజకీయ నాయకత్వం కేవలం నిర్ణయాత్మక చర్య తీసుకోవాలనే ఉద్దేశాన్ని చూపడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న సైనిక కమాండర్లకు పూర్తి కార్యాచరణ స్వేచ్ఛను ఇచ్చే అంతటి ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది. లక్ష్యం పట్ల ఉన్న ఈ స్పష్టత.. వేగం, ఖచ్చితత్వం, సమన్వయంగా మారింది. ఆధునిక సైనిక పోరాటాల విజయానికి ఈ మూడు లక్షణాలే అత్యంత కీలకం. రాజకీయ సంకల్పానికి వ్యవస్థాగత సామర్థ్యం తోడైనప్పుడు అది దేశ బలాన్ని ఎన్నో రెట్లు పెంచుతుంది. ఆపరేషన్ సింధూర్ ఈ అద్భుతమైన సమన్వయానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది.

అంతే ప్రాముఖ్యత కలిగిన మరొక అంశం, భారతదేశం తన బహు-ముఖ సామర్థ్యాలను అత్యంత సమర్థవంతంగా అనుసంధానించడం. నేటి ఆధునిక యుద్ధం.. భూమి, నీరు, ఆకాశానికే పరిమితం కాలేదు; సైబర్, అంతరిక్షం, ఎలక్ట్రోమాగ్నెటిక్ స్పెక్ట్రమ్కు కూడా విస్తరించింది. ఈ విభిన్న రంగాల్లో తన పట్టును ప్రదర్శించడంలో దేశానికున్న ప్రావీణ్యాన్ని ఆపరేషన్ సింధూర్ నిరూపించింది. ఖచ్చితమైన దాడులతో పాటు శత్రువుల సమాచార వ్యవస్థ, సరఫరా గొలుసును దెబ్బతీసే సైబర్ ఆపరేషన్లు తోడయ్యాయి. ఎప్పటికప్పుడు నిఘా, లక్ష్యాలను గుర్తించడంలో అంతరిక్ష వనరులు కీలక పాత్ర పోషించాయి. లక్ష్యాల్ని గుర్తించడంతో పాటు దాడి తర్వాత జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలోనూ క్రియాశీలకంగా పని చేశాయి. అదే సమయంలో, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ సామర్థ్యాలు శత్రువుల స్పందనను బలహీనపరిచాయి. ఈ ఆపరేషన్ భారత దళాల మధ్య కేవలం సమన్వయాన్నే కాదు, సమష్టి పనితీరు, పరిణతిని ప్రతిబింబించింది.

ఈ సమయంలో సివిల్-సైనిక వ్యవస్థల ఏకీకరణ పోషించిన పాత్ర ప్రత్యేకంగా గమనించాలి. ఆపరేషన్ సింధూర్ కేవలం సైనిక ప్రయత్నమే కాదు, దేశం మొత్తం కలిసి చేసిన కృషి. నిఘా సంస్థలు, సాంకేతిక సంస్థలు, పౌర నాయకత్వం, సాయుధ దళాలతో కలిసి పనిచేశాయి. నిఘా వ్యవస్థల నుంచి ఖచ్చితమైన ఆయుధాల వరకు స్వదేశీ సాంకేతికతలు కీలక పాత్ర పోషించాయి, ఇది స్వయంసమృద్ధిపై మనం నిరంతరం పెట్టిన పెట్టుబడి ఫలితాన్ని చూపించింది. ఈ ఆపరేషన్ భారత నిర్ణయాధికార నిర్మాణంలోని సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించింది, ఇక్కడ వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం, బ్యూరోక్రాటిక్ జాప్యాలకు తావు లేకుండా ఒకే లక్ష్యంతో సాగింది.

ఆపరేషన్ ప్రారంభానికి ముందే భారతదేశం ఎంతో దూరదృష్టితో వ్యవహరించింది. మనం తీసుకునే చర్యలను ప్రపంచం ఏ విధంగా చూస్తుందనే విషయంలో భారత్ చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. మన దౌత్యవేత్తలు ప్రపంచ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరిపి, భారత్ చేస్తున్న ఈ పోరాటం ఎవరినో ఆక్రమించుకోవడానికి కాదని, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు సమాధానంగా చేస్తున్న 'అవసరమైన ఆత్మరక్షణ' అని స్పష్టంగా వివరించారు. దీనివల్ల అంతర్జాతీయ సమాజం కూడా భారత్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని గుర్తించింది. ఇలా సైనిక శక్తికి, రాజకీయ నేర్పు, దౌత్యనీతి తోడవ్వడం వల్లే ఆపరేషన్ సింధూర్ ఒక చారిత్రక విజయంగా నిలిచింది.

దీనికి భిన్నంగా, పాకిస్థాన్ స్పందన ముందే ఊహించినట్లుగా సాగింది. సైనిక పరంగా చూస్తే, భారత్ మెరుపుదాడికి ఆ దేశం కంగుతిన్నది. తమ దగ్గర ఉన్న అరకొర వనరులు, సరిపోని యుద్ధ సామర్థ్యం వల్ల భారత్ను సమర్థంగా ఎదుర్కోవడంలో పాకిస్థాన్ విఫలమైంది. ఇక దౌత్యపరంగా, ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లి ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టాలని చూసినా.. అనుకున్న ఫలితం సాధించలేదు. అయితే, పాకిస్తాన్ ఎక్కువగా దృష్టి పెట్టింది మాత్రం 'సమాచార యుద్ధం' మీదనే. క్షేత్రస్థాయిలో జరిగిన అసలు విషయాలను దాచిపెట్టడానికి, వారు తెలివిగా అల్లిన ఎన్నో అబద్ధాలను ప్రచారం చేశారు. కానీ, వారి మాటల్లో నిజాయితీ, పొంతన లేకపోవడంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. నేటి ఆధునిక సమాచార వెసులుబాటు అందుబాటులోకి వస్తుండటంతో, పాకిస్తాన్ అల్లిన అబద్ధపు కథనాలు ప్రపంచం ముందు త్వరగానే బట్టబయలయ్యాయి.

ఈ తప్పుడు ప్రచారాన్ని ఎంతో స్పష్టతతో, ఆత్మవిశ్వాసంతో తిప్పికొట్టడం చాలా ముఖ్యం. ఆపరేషన్ సింధూర్ అనేది భారతదేశం కావాలని చేసిన దురాక్రమణ కాదు.. శత్రువుల ప్రత్యక్ష రెచ్చగొట్టే చర్యలకు భారత్ ఇచ్చిన సరైన సమాధానం. ఈ ఆపరేషన్ లక్ష్యాలు చాలా స్పష్టమైనవి, ఎంచుకున్న స్థావరాలు చట్టబద్ధమైనవి, దీని అత్యంత క్రమశిక్షణతో నిర్వహించారు. భారతదేశం ఎప్పుడూ హద్దులు దాటలేదు; అవసరమైన మేరకు మాత్రమే స్పందిస్తూ, అత్యంత సంయమనంతో వ్యవహరించింది. ఆపరేషన్ జరిగినంత కాలం భారత్ నిజమైన సమాచారాన్ని మాత్రమే వెల్లడించింది. ఎంతో పారదర్శకతను పాటిస్తూ, విశ్వసనీయమైన మార్గాల ద్వారా అసలు విషయాలను ప్రపంచానికి తెలియజేయడం వల్ల, వాస్తవాలను వక్రీకరించే శత్రువుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి.

ఆపరేషన్ సింధూర్ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే కొన్ని విలువైన పాఠాలను నేర్పింది. మొదటిది, రాజకీయ సంకల్పం అత్యంత కీలకం. మనం ఏ విషయంలోనైనా అస్పష్టంగా ఉంటే అది శత్రువులకు బలాన్నిస్తుంది, అదే స్పష్టమైన వైఖరితో ఉంటే వారు భయపడతారు. రెండోది, యుద్ధతంత్రంలో కేవలం సైన్యమే కాదు, సైబర్, అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక రంగాల్లో కూడా మనం పట్టు సాధించాలి. భవిష్యత్తులో మన ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడానికి ఈ రంగాల్లో పెట్టుబడులు చాలా అవసరం. మూడవది, దేశంలోని పౌర, సైనిక వ్యవస్థలు మరింతగా కలిసి పనిచేయాలి. జాతీయ శక్తిని ఒక పద్ధతి ప్రకారం సమన్వయం చేసుకున్నప్పుడే మనం ఏ సవాలునైనా సమర్థంగా ఎదుర్కోగలం.

మరొక ముఖ్యమైన పాఠం సమాచార యుద్ధతంత్ర రంగంలో ఉంది. ప్రజల ఆలోచనలను, అభిప్రాయాలను ప్రభావితం చేసే ఈ పోరాటం నిరంతరం, ఎటువంటి సరిహద్దులు లేకుండా సాగుతూనే ఉంటుంది. తప్పుడు సమాచారాన్ని గుర్తించడానికి, దానిని తిప్పికొట్టడానికి, అది వ్యాప్తి చెందక ముందే అడ్డుకోవడానికి భారతదేశం తన సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలి. దీనికోసం కేవలం అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉంటే సరిపోదు; వేగవంతమైన, నమ్మదగ్గ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే బలమైన వ్యవస్థలు కూడా ఉండాలి. యుద్ధ క్షేత్రంలో విజయం సాధించడమే కాదు, ప్రపంచం ముందు సరైన వాస్తవాలను నిలబెట్టి మన వాదనను గెలిపించుకోవడమనేది వ్యూహాత్మక విజయానికి అత్యంత కీలకం.

ఆపరేషన్ సింధూర్ రక్షణ రంగంలో స్వయంసమృద్ధి ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది. మన దేశంలోనే తయారైన యుద్ధ వ్యవస్థలు తమ సత్తాను నిరూపించుకున్నాయి. దీనివల్ల ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గడమే కాకుండా, మన నిర్ణయాలు మనమే తీసుకునే స్వేచ్ఛ పెరిగింది. పరిశోధన, అభివృద్ధి, సరికొత్త ఆవిష్కరణలలో నిరంతరం పెట్టుబడులు పెట్టడం ద్వారానే ఈ వేగాన్ని మనం కొనసాగించగలం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కలిసికట్టుగా పనిచేయడం అత్యంత కీలకం. ఇలాంటి సమన్వయం ఉన్నప్పుడే రక్షణ రంగంలో భారత్ మరింత శక్తివంతంగా మారుతుంది.

చివరగా, అస్థిరమైన భద్రతా వాతావరణంలో మనం ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలనే అవసరాన్ని ఈ ఆపరేషన్ గుర్తు చేస్తుంది. శత్రువును నియంత్రించడమనేది ఒకేచోట ఆగిపోయే అంశం కాదు; మనకు ఉన్న శక్తి సామర్థ్యాలను, దృఢ నిశ్చయాన్ని నిరంతరం నిరూపించుకుంటూనే దానిని బలోపేతం చేయాలి. ఆపరేషన్ సింధూర్ ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. అయితే, ఈ స్థాయిని భవిష్యత్తులోనూ కొనసాగించాలంటే నిరంతర కృషి అవసరం. దీనికోసం సైనిక శిక్షణను మెరుగుపరచడం, యుద్ధ తంత్రాలను ఆధునీకరించడం, మారుతున్న కాలానికి అనుగుణంగా మన రక్షణ సిద్ధాంతాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ముందుకు సాగాలి.

భారతదేశం 'ఆపరేషన్ సింధూర్' వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, ఈ ఆపరేషన్ అందించిన సందేశం చాలా స్పష్టంగా ఉంది. ఇది కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాదు, ఒక బలమైన వ్యూహాత్మక ప్రకటన. తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన సామర్థ్యం, ఆ పనిని నిర్ణయాత్మకంగా పూర్తి చేయగల సంకల్పం.. రెండూ భారతదేశానికి ఉన్నాయని ప్రపంచానికి చాటిచెప్పింది. 'నియంత్రణ' పాటించడం అనేది ఒక ఎంపిక మాత్రమే తప్ప, అది బలహీనత వల్ల వచ్చిన తప్పనిసరి పరిస్థితి కాదని ఈ ఆపరేషన్ ద్వారా నిరూపితమైంది. అంటే, భారత్ శాంతిని కోరుకుంటున్నప్పటికీ, అవసరమైతే కఠినంగా స్పందించడానికి వెనుకాడదని స్పష్టమైంది.

రాబోయే కాలంలో, 'ఆపరేషన్ సింధూర్' ఒక అత్యుత్తమ ఉదాహరణగా నిలిచిపోతుంది. బలమైన రాజకీయ నాయకత్వం, జాతీయ సమైక్యత అండగా ఉంటే, మల్టీ-డొమైన్ ఆపరేషన్లను ఎంత సమర్థవంతంగా నిర్వహించవచ్చో ప్రపంచానికి తెలియజేసే పాఠమిది. ఈ ఆపరేషన్ భారత్ పట్ల దేశీయంగా, అంతర్జాతీయంగా ఉన్న అంచనాలను పూర్తిగా మార్చివేసింది. అన్నిటికంటే ముఖ్యంగా, ఇది ఒక శక్తివంతమైన సూత్రాన్ని మరోసారి స్థిరపరిచింది: జాతీయ సంకల్పం, సామర్థ్యం కలిసి పనిచేసినప్పుడు, ఫలితాలెప్పుడూ తిరుగులేని విధంగానే ఉంటాయి.

ఆపరేషన్ సింధూర్ వారసత్వం కేవలం ఆ సమయంలో దక్కిన విజయానికే పరిమితం కాలేదు. అది మనలో నింపిన ఆత్మవిశ్వాసంలో, మన వ్యవస్థలు అంతర్గతంగా నేర్చుకున్న పాఠాలలో, భారతదేశ వ్యూహాత్మక భవిష్యత్తు కోసం అది నిర్దేశించిన దిశలో ఆ వారసత్వం దాగి ఉంది. భవిష్యత్తులో కూడా ఇంకా పరిష్కారం కాని వివాదాలు వివిధ రంగాల్లో, కొత్త రూపాల్లో దేశాన్ని పరీక్షిస్తూనే ఉంటాయి. అయినప్పటికీ, దేశంలోని రాజకీయ, సైనిక, వ్యవస్థాగత యంత్రాంగాలు అన్నీ ఒకే తాటిపై ఉండి, పూర్తి స్పష్టతతో, ఒకే లక్ష్యంతో తమ శక్తినంతా సమన్వయం చేసుకున్నంత కాలం, ఆ ప్రభావం సమతుల్యత ఖచ్చితంగా భారత్ కు అను కూలంగానే ఉంటుంది. అంటే, మన దేశంలోని అన్ని విభాగాలు కలిసికట్టుగా పనిచేసినంత కాలం, ఎదురయ్యే సవాళ్లపై భారత్ పైచేయి సాధిస్తూనే ఉంటుంది.



----Lt Gen Syed Ata Hasnain (Retd)

రచయిత :: లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్ (రిటైర్డ్). (బీహార్ రాష్ట్ర గవర్నర్, భారతదేశపు శ్రీనగర్ కేంద్రంగా పనిచేసే చినార్ కార్ప్స్ మాజీ కమాండర్)

(The writer is Governor, State of Bihar and former Commander of Indiaμs Srinagar based Chinar Corps)

# వినూత్న పాలనతో నెల్లూరు జిల్లాలో కనిపిస్తున్న మార్పు

- గ్రామాల నుంచి పరిశ్రమల దాకా అన్నింటా కలెక్టర్ మార్క్
- సంక్షేమం, అభివృద్ధి, జవాబుదారీతనంతో సమతుల్య పాలన









**నెల్లూరు,మే 6 (వార్తాప్రభ) :** వినూత్న ఆలోచనలు, జవాబుదారీతనం, వేగవంతమైన నిర్ణయాలతో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అతి తక్కువ కాలంలోనే జిల్లాలో స్పష్టమైన మార్పులు తీసుకువస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన ఆయన గ్రామీణ స్థాయి పాలనను బలోపేతం చేస్తూనే, అభివృద్ధి కార్యక్రమాలకు వేగం పెంచుతున్నారు. జిల్లా కలెక్టర్ పదవి సివిల్ సర్వీసెస్ అభ్యర్థులు కలగనే అత్యున్నత లక్ష్యాల్లో ఒకటి. ఆ బాధ్యతల్లోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఉపయోగపడేలా పని చేసి ప్రత్యేక గుర్తింపు పొందడం కొద్దిమందికే సాధ్యం. ఆ దిశగా హిమాన్షు శుక్లా వేగంగా ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన తొలి రోజుల నుంచే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారు. పీజీఆర్ఎస్లో వచ్చిన మొదటి అర్జీకే వేగంగా స్పందించి, కావలి ప్రాంతానికి చెందిన ఒక మహిళ గృహ సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగింది.

**పరిశ్రమలకు కొత్త ఊపు..** హిమాన్షు శుక్లా నేతృత్వంలో నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక రంగానికి కొత్త ఊపు వచ్చింది. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేలా భూములను సిద్ధం చేస్తున్నారు. దుత్తలూరు మండలం రాచవారిపల్లిలో రూ.3,000 కోట్లతో డిఫెన్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు భూసేకరణ వేగంగా సాగుతోంది. ఈ పరిశ్రమలో క్షిపణులు, రాకెట్లు, లాంచర్లు తయారు చేయనున్నారు. మనుబోలు మండలం మడమనూరులో శ్యామ్ మెటాలిక్స్ పరిశ్రమ పనులు కూడా ముందుకు సాగుతున్నాయి. మరోవైపు ఇఫ్కో కిసాన్ సెజ్లోకి కొత్త పెట్టుబడులు వస్తున్నాయి. టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ రూ.6,500 కోట్లతో సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 2028 నాటికి సుమారు వెయ్యి మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది.

**'పల్లె వీక్షణం'తో గ్రామాల వైపు పాలన..** గ్రామీణ పాలనను మరింత బలోపేతం చేయడానికి "పల్లె వీక్షణం" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి వారం ఒక గ్రామాన్ని జిల్లా స్థాయి అధికారులతో కలిసి సందర్శిస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును పరిశీలిస్తున్నారు. ఉపాధి హామీ పనులు, అంగన్వాడీ కేంద్రాలు, వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తూ గ్రామస్తులతో నేరుగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే ఆత్మకూరు, దగదర్తి, సీతారామపురం, ఉదయగిరి మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

**'చాంపియన్ ఫార్మర్స్'తో వ్యవసాయానికి కొత్త దిశ..** వ్యవసాయ రంగంలో "చాంపియన్ ఫార్మర్స్" కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోంది. సుమారు 700 మంది రైతులను ఎంపిక చేసి సహజ వ్యవసాయం, సమగ్ర కీటక నియంత్రణ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చారు. బహుళ పంటల సాగు, ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ వంటి పద్ధతులను అవలంబించడం వల్ల రైతులకు దిగుబడులు పెరిగి, ఖర్చులు తగ్గుతున్నాయి. వ్యవసాయ శాఖ సహకారంతో ఫెరోమోన్ ట్రాప్స్, లైట్ ట్రాప్స్ వినియోగం పెంచుతున్నారు. దీని వల్ల రసాయన మందుల వినియోగం తగ్గి, భూగడ, వరి, జొన్న వంటి పంటల్లో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఇది ఇతర రైతులకు కూడా ఆదర్శంగా మారుతోంది.

**ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం..** జిల్లా పాలనలో ఉద్యోగుల సంక్షేమానికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. చాలా కాలంగా పెండింగ్లో ఉన్న పదోన్నతుల ఫైళ్లను పరిష్కరిస్తూ వందలాది మంది ఉద్యోగులకు లాభం చేకూరుస్తున్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఉద్యోగుల సమస్యలను వినడానికి ప్రతి నెల మూడో శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నారు. మొత్తానికి, వినూత్న ఆలోచనలు, పరిపాలనా చురుకుదనం, సమగ్ర అభివృద్ధి---ఈ మూడు లక్షణాలతో హిమాన్షు శుక్లా నెల్లూరు జిల్లాను మంచి ప్రభుత్వ పాలనకు ఒక ఉదాహరణగా నిలబెడుతున్నారు.

# ప్రభుత్వ విద్యా సంస్థలు బలో పేతమే డెమోక్రటిక్ పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం లక్ష్యం

-పి.ఆర్.టి.యు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు బి. మోహన్ రెడ్డి




**విజయవాడ,మే 6 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం లక్ష్యంగా విద్యా ప్రమాణాలు అభివృద్ధి ఆశయం గా డెమొక్రటిక్ పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం అద్భుతంగా పని చేస్తుందని పి ఆర్ టి యు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులుబి మోహన్ రెడ్డి అన్నారు.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ పర్యటన కు విచ్చేసిన తెలంగాణ పిఆర్టియు నాయకులు డెమొక్రటిక్ పిఆర్టియు రాష్ట్ర కార్యాలయం ఈరోజు ఉదయం సందర్శించ గా స్థానిక కార్యకర్తలు వారికి ఘనం స్వాగతశీ సత్కారాలు అందచేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు డా. డి.శ్రీను అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పి.ఆర్.టి.యు తెలంగాణ యం.ఎల్.సి , శ్రీ పాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటుగా ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి బెస్ట్ ఎన్రోల్మెంట్ అవార్డులు విజయభేరి పురస్కారాలు ఉచిత స్టడీ మెటీరియల్ పేద విద్యార్థులకు స్కాలర్షిప్ లు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాల బలుపేతానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. పి.ఆర్.టి.యు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పి.ఆర్.టి.యు మాతృ సంఘ గౌరవాన్ని కాపాడే విధంగా విద్యా సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, డాక్టర్ డి శ్రీను, పి వెంకటేశ్వరరావు లను వారికి రాష్ట్ర కార్యవర్గాన్ని అభినందించారు.మాతృ సంఘ నాయకులుగా సంఘ అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో,డెమొక్రటిక్ పిఆర్టియు యన్.టి.ఆర్,జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి.నాగరాజు, విజయవాడ నగర శాఖ అధ్యక్షులు ఈ.వెంకట్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రసాద్,మత్తి శ్రీనివాస్.పి.కుమార్ రాజా, పి.సుబ్రహ్మణ్యం యన్.జోజయ్య,బదరీ నారాయణ,దుర్గా రావు,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వల్ల ఉపయోగాలు



**హనుమాన్ జంక్షన్,మే 6 (వార్తాప్రభ) :** కృష్ణ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వి విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లవల్లి ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియాలో హనుమాన్ జంక్షన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ రమేష్, వీరవల్లి ఎస్సై సత్యం సురేష్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినారు. వాహనం దారులకు హెల్మెట్ ధరించడం వల్ల ఉపయోగాలు, ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ మనల్ని ఏవిధంగా రక్షిస్తుంది అనే అంశాల పై అవగాహన కల్పించారు. మరియు బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేసేవారినీ అదుపులోనికి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించి కేసులు నమోదు చేశారు.

# అధికారులు పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటాను - ఎమ్మెల్యే బోడె ప్రసాద్



**కంకిపాడు,మే 6 (వార్తాప్రభ) :** పెనమలూరు నియోజకవర్గం,కంకిపాడు మండలం, గొల్లగూడెం గ్రామంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పర్యటించారు. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా,చెదారం, మురుగునీరు రోడ్డు మీదకు రావడంతో రోడ్ల డ్రైనేజీలు 90% పూర్తయిన గ్రామంలో ఈ విధంగా ఉండటం ఏంటని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. ఆమె సరైన సమాధానం చెప్పకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహించి నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా పనితీరు మార్చుకోవాలని సూచించారు, చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్ది జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి నిరంతరం స్వయంగా నీవే పర్యవేక్షిస్తానని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ప్రతి వీధిలోని మహిళలను, వృద్ధులను పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ మొట్టమొదటిసారి ఎమ్మెల్యేగా నేను గెలిచినప్పుడు ఈ గ్రామంలో 90 శాతం అభివృద్ధి పనులు చేశామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సిసి రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మించిన కాలంతో పాటు వచ్చిన అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. వచ్చే రెండు నెలల్లో 100% అభివృద్ధి పనులు పూర్తిచేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నెరసు రాజ్యలక్ష్మి, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు సంఘపు రంగారావు, మండపాటి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, గ్రామ టిడిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యలో గాలిలో మేడలు వద్దు గట్టి పునాదే ముద్దు... అక్కడి నుంచే లోకేశ సంస్కరణలు

- ఫ్యాన్సీ విద్యా విధానాల జోలికి వెళ్లని మంత్రి లోకేశ్



**విజయవాడ,మే 6 (వార్తాప్రభ) :** గాలిలో మేడలు కట్టొద్దు అని హితవు చెప్పే పెద్దలు నేలపై నిలబడమంటారు. సవాళ్లతో కూడిన విద్యాశాఖను చేపట్టిన నారా లోకేశ్ గాలిలో మేడలు కట్టే యంత్రాంగానికి అసలు మన విద్య ఎక్కడుందో చూడండంటూ ఆదేశాలిచ్చారు. విదేశాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని, విదేశాల్లోనే వరల్డ్ బ్యాంకులో ఉన్నత ఉద్యోగం చేసిన లోకేశ్ విద్యాశాఖలో ఫ్యాన్సీ విదేశీ విద్యావిధానాలు అమలు చేయాలని యత్నించలేదు. గత పాలకుల మాదిరిగా టోఫెల్, ఐబీ అంటూ నేల విడిచి సాము చేయలేదు. నేషనల్ అచీవ్ మెంట్ సర్వే, యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ నివేదికల మేరకు కనీస అభ్యసనా సామర్థ్యాలు విద్యార్థుల్లో లేవని గుర్తించారు. ఇవి పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**దేశంలోనే తొలిసారిగా .గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్..** భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 38391 ప్రాథమిక పాఠశాలల్లో గ్యారెంటీడ్ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (జీ-ఎఫ్ఎల్ఎన్) అమలు ఆరంభించారు. ప్రతీ విద్యార్థికి బలమైన పునాది అభ్యసనాలు ఒత్తిడితో కాదు, ఉల్లాసంతో, ఆటపాటలతో మొదలవ్వాలి. అందుకే మన ప్రభుత్వ పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థుల కోసం గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (జీ-ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. మన ప్రాథమిక పాఠశాలల్లోకి అడుగుపెడితే, విద్యార్థులు పుస్తకాల్లోని అంశాలను బట్టీ పట్టడం కాకుండా, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, ఎడ్యుటైన్మెంట్ యాక్టివిటీస్ వంటి, బాలా ఫీచర్స్ వంటి బోధన ద్వారా ఎంతో సరదాగా, ఆహ్లాదకరంగా, ఆనందంగా, ఆడుతూ పాడుతూ నేర్పుతున్నారు.

# భూ వివాదాలకు చెక్ పెట్టడం కోసమే నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

## – మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

● గడ్డమణుగులో 424 పాసుబుక్స్ అందజేత ● రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే







**జి.కొండూరు,మే 6 (వార్తాప్రభ) :** భూ వివాదాలకు చెక్ పెట్టడం కోసమే ప్రభుత్వం రీ సర్వే 2.0 చేపట్టి నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. మీ భూమి--మీ హక్కు కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు మండలం గడ్డమణుగు గ్రామంలో బుధవారం ఇంచార్జ్ తహశీల్దార్ యమ్. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నూతన పటాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు ప్రభుత్వ రాజ్యముద్రతో కూడిన 424 పట్టాదారు పాసు పుస్తకాలను అధికారులు, కూటమి నేతలతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గడ్డమణుగు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన మూడు సిమెంట్ రహదారుల ను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ప్రారంభించా రు.భూమిపై రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం "మీ భూమి--మీ హక్కు" కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పాస్ పుస్తకాలను తయారు చేసినట్లు వెల్లడించారు.ప్రభుత్వ రాజ్యముద్రతో జారీ చేసిన పాసు పుస్తకాల వల్ల రైతులకు బ్యాంకు రుణాలు, వ్యవసాయ పెట్టుబడులు సులభంగా లభిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.వి.రామకృష్ణ నాయక్, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ షేక్.షీమా బేగం, గడ్డమణుగు గ్రామ ప్రత్యేక అధికారి స్వరూప రాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏటుకూరి బసవలింగేశ్వరరావు, జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గం ఇంచార్జ్ అక్కల గాంధీ, జి.కొండూరు మండలం టీడీపీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు, లంక నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహా రావు, ఐ డి సి డైరెక్టర్ అంకెమ్ ఇందిరా ప్రియదర్శిని,గడ్డమణు గు గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు నూతక్కి అపర్ణ, నూతక్కి రాజా, స్థానిక టీడీపీ నాయకులు సూదిరెడ్డి సురేష్, జి కొండూరు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు యర్రబోలు నరసింహా రావు, చెవుటూరు పిఎసిఎస్ చైర్మన్ ఈమని మురళీకృష్ణ, కుంటముక్కల పిఎసిఎస్ చైర్మన్ సుఖవాసి శ్రీహరి,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్ నీటి బకాయిలను రికవరీ చేయండి




● లోకాయుక్త ఉత్తర్వులను అమలు చేయండి
● ప్రెస్‌క్లబ్ నీటి పన్ను బకాయిలు 4,25,300 రూపాయలు
● బకాయిలు చెల్లించకుండా బుకాయిస్తున్న ప్రెస్‌క్లబ్ యాజమాన్యం
● అధికారులకు తెలియకుండా దొంగతనంగా అక్రమ కనెక్షన్
● పోలీసు కేసు పెట్టకుండా కార్పొరేషన్ అధికారులు తాత్సారం
● రెండు సంవత్సరాలైనా బకాయిలు చెల్లించని ప్రెస్‌క్లబ్ యాజమాన్యం
● సామాన్యులపై కూడా ఇలాగే ప్రవర్తిస్తారా అంటూ విమర్శల వెల్లువ

**విజయవాడ,మే 6 (వార్తాప్రభ) :** విజయవాడ ప్రెస్ క్లబ్ చెల్లించాల్సిన నీటిపన్ను బకాయిలను తక్షణమే రికవరీ చేయాలని సీనియర్ జర్నలిస్ట్ కస్తాల నమ్మయ్య విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరుకు ఫిర్యాదు చేశారు. గత కొన్నేళ్ళక్రితం విజయవాడ ప్రెస్‌క్లబ్ నీటిపన్నులను చెల్లించకపోవడంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రెస్‌క్లబ్ నీటి కుళాయి కనెక్షన్‌ను దమ్మి చేశారు. అయితే రోడ్డు డివైయిడింగ్ సమయంలో అధికారులకు ఎవ్వరికీ తెలియకుండా దొంగతనంగా దమ్మిని తొలగించి ప్రెస్‌క్లబ్‌కు నీటి సరఫరా చేసుకుంటున్నారు. ఈ విషయం తెల్సుకున్న సీనియర్ జర్నలిస్టు కూర్మాప్రసాద్ బాబు రెండు సంవత్సరాల క్రితం విజయవాడ కార్పొరేషన్ కమిషనరుకు స్పందనలో ఫిర్యాదు చేయగా డొంకంతా కదిలింది. కార్పొరేషన్ అధికారు లంతా వచ్చి తనిఖీలు చేయగా ప్రెస్‌క్లబ్ యాజమాన్యం దొంగతనం బయటపడింది. దీంతో ప్రెస్‌క్లబ్ నీటి కుళాయి కనెక్షన్‌ను దమ్మి చేసి పాతబ కాయిలు, జరిమానాల క్రింద 4,50,300 రూపాయలు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారం తమకు ఏమాత్రం తెలియ దంటూ బుకాయించిన ప్రస్తుత పాలక వర్గం 25వేలు చెల్లించి కమిషనరు నుండి అనుమతులు పొంది నీటి కుళాయి కనెక్షన్ పునరుద్ధరించు కున్నారు. అప్పట్లో పూర్తి సొమ్ము చెల్లిస్తామని హామీనిచ్చిన ప్రెస్‌క్లబ్ యాజమాన్యం ఆ తర్వాత బకాయిల చెల్లింపుల విషయమే మర్చిపోయారు. ఈ నేపథ్యంలో సదరు నీటి బకాయిలు రికవరీ చేయాలంటూ సీనియర్ జర్న లిస్టు కస్తాల నమ్మయ్య ప్రజాసమస్యల పరిష్కార వేదికలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరుకు ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదుపై కార్పొరేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విసిగిపోయి ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తను ఆశ్రయించారు. కస్తాల నమ్మయ్య ఫిర్యాదును విచారణకు స్వీకరించింది. ఉప లోకాయుక్త విచారణ జరిపింది. ప్రెస్‌క్లబ్ నీటిపన్ను బకాయిలపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ ఉప లోకాయుక్త జస్టిస్ పి. రజని మార్చి 2వ తేదీన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపలోకా యుక్త ఉత్తర్వులు జారీ చేసి రెండు నెలలవుతున్నా కమిషనరు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై ఉప లోకాయుక్త ఉత్తర్వులను అమలు చేసి, నీటి బకాయిలను రికవరీ చేయాలంటూ కస్తాల నమ్మయ్య మళ్ళీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

# రేంజ్ రోవర్ సీబీయూ మోడళ్ల సవరణ ధరలను ప్రకటించిన జేఎల్ఆర్ ఇండియా





**విజయవాడ,మే 6 (వార్తాప్రభ) :** ఇండియా యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టీఏ) అమలును దృష్టిలో ఉంచుకుని, యూకే నుంచి దిగుమతి అయ్యే రేంజ్ రోవర్ సీబీయు మోడళ్ల ధరలను సవరించినట్లు జేఎల్ఆర్ ఇండియా ప్రకటించింది. ఈ ఎఫ్టీఏ ద్వారా ప్రయోజనం పొందే ప్రధాన మోడళ్లు ప్రధానంగా రేంజ్ రోవర్ ఎస్వీ మరియు రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్వీ. ఈ ప్రకటనలో భాగంగా, రేంజ్ రోవర్ ఎస్వీ ధర రూ. 425 లక్షల నుండి రూ. 350 లక్షలకు తగ్గించబడింది. అదే విధంగా రేంజ్ రోవర్ ఎస్వీ యొక్క విలువ ప్రతిపాదన గణనీయంగా మెరుగుపడింది. ఇందులో భాగంగా, గ్లోస్ మరియు సాటిన్ ఫినిష్ లలో లభించే ఎస్వీ అల్ట్రా మెటాలిక్ పెయింట్‌లను ఇప్పుడు మొదటిసారిగా ప్రామాణిక ఫీచర్‌లుగా అందిస్తున్నారు. అలాగే, రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్వీ ధర రూ. 275 లక్షల నుండి రూ. 235 లక్షలకు తగ్గించబడింది. ఇది మార్కెట్లో దాని స్థానాన్ని గణనీయంగా బలోపేతం చేస్తుంది. ఈ సవరించిన ధరలు ఎఫ్ టీ ఏ ద్వారా సాధ్యమైన కొత్త సుంకాల విధానాన్ని ప్రతిబింబిస్తాయి. అలాగే ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని కూడా జేఎల్ఆర్ ఇండియా ప్రకటించింది. ఈ సందర్భంగా జేఎల్ఆర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రాజన్ అంబా మాట్లాడుతూ: "ఇండియా యూకే ఎఫ్ టీఏ అమలు కాబోతుందన్న అంచనాలతో, దాని ప్రయోజ నాలను మా వినియోగదారులకు అందించడానికి మేము సంతోషిస్తున్నా ము. రేంజ్ రోవర్ ఎస్వీ మరియు రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్వీ ధరల సవరణ, వినియోగదారులకే అగ్ర ప్రాధాన్యతనిచ్చే మా విధానాన్ని మరియు మా వినియోగదారులతో దీర్ఘకాలిక సంబంధాలను నిర్మించు కోవాలన్న మా నిబద్ధతను నొక్కి చెబుతుం దన్నారు. ఈ ఎఫ్ టీఏ ద్వారా, మరింత మంది వినియోగదారులు అత్యంత ఆకర్షణీయమైన మరియు ప్రతిష్టాత్మకమైన ఎస్వీ పోర్ట్ ఫోలియోను సొంతం చేసుకునే అవకాశం లభిస్తుందని, తద్వారా జేఎల్ఆర్ వృద్ధి ప్రస్థానం మరింత బలోపేతం అవుతుందని మేము విశ్వసిస్తున్నాము," అని అన్నారు.

# ప్లాస్మా టెక్నాలజీ ద్వారా బూడిద గా హానికర వ్యర్థాలు



**అమలాపురం,మే 6 (వార్తాప్రభ) :** ప్లాస్మా టెక్నాలజీ ద్వారా తడి,పొడి చెత్తను హానికరమైన వ్యర్థాలను బూడిదగా మార్చడం ఆధునిక, పర్యావరణహితమైన వ్యర్థాల నిర్వహణ పద్ధతని జిల్లా కలెక్టరు ఆర్ మహేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక డంపింగ్ యార్డు వద్ద నిర్మించిన ప్లాస్మా టెక్నాలజీతో వ్యర్థాల నిర్వహణ కొరకు ప్లాస్మా టెక్నాలజీతో ఏర్పాటు చేసిన యూనిట్కు జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో ట్రైన్ రన్ నిర్వహించారు. ?ఈ సంద ర్భంగా ఆయన ప్రసంగిస్తూ ?సాధారణంగా పదార్థాలు ఘన, ద్రవ, వాయు రూపాల్లో ఉంటాయని,ప్లాస్మా అనేది నాలుగో రూపం అత్యధిక ఉష్ణోగ్రత వద్ద వాయువును మండించి నప్పుడు అది ప్లాస్మాగా మారుతుందన్నారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ద్వారా హానికరమైన వ్యర్థాలు మిక్స్డ్ డ్రైవ్ వేస్ట్ ప్రాసెసింగ్ చేసేందుకు వీలుగా రోజువారి 10 మెట్రిక్ టన్నులు ప్రాసెసింగ్ చేసే యూనిట్ను నెలకొల్ప డం జరిగిందన్నారు. దీనికి ఎటువంటి గ్యాసు కరెంటు అవసరం లేదని లోపల మిషనరీ పని చేయడానికి బర్నింగ్ కు మాత్రమే కరెంటు అవసరమన్నారు. బర్నింగు ప్లాస్మా టార్చ్ లను ఉపయోగించి దాదాపు ఉష్ణోగ్రతను సృష్టిస్తారన్నారు. బర్నింగ్ చాంబర్ క్లాస్మేట్ టెక్నాలజీ ద్వారా గాలిలో స్వచ్ఛమైన ఆక్సిజన్ ను లోపలికి పంపిస్తూ 850-1500 డిగ్రీల సెంటిగ్రేడ్ టెంపరేచర్ తో 95% వేస్టు బర్నింగ్ అవుతుందని 5 శాతం మాత్రమే బూడిద వస్తుందన్నారు.బూడిద ద్వారా గ్యాస్ వస్తుందని ఫ్లూ గ్యాస్ నాలుగు రకాలుగా ఉంటుందన్నారు. గ్యాసు దుమ్ము ధూళి 20 మైక్రాన్లు వేస్టును కిందకు నెడు తుందన్నారు.దీనిలో 195 బ్యాగులు ఉంటాయని వీటి ద్వారా 5 శాతం మైక్రాల డస్టు కలెక్ట్ అవుతుందన్నారు నాలుగు దశలలో ప్యూర్ ఎయిర్ బయటకు వస్తుందన్నారు ఈ ప్లాంట్ నందు 150 కెవిఏ ట్రాన్స్ఫా ర్మర్ను ఏర్పాటు చేయడం జరిగిందని ప్లాంట్ అవస రాలకు 120 కె.వి.ఏ కెపాసిటీ సరిపోతుంద న్నారు ఆక్సిజన్ వచ్చి ఈ విపరీతమైన వేడి వల్ల చెత్తలోని అణువులు విచ్ఛి న్నమవుతాయన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ లేదా మెడికల్ వేస్టు నేరుగా వాయువులుగా,చిన్నపాటి బూడిదగా మారి పోతుందన్నారు?. ఈ టెక్నాలజీ వల్ల ?చెత్త కుప్పలు ఉండవనీ పెద్ద ఎత్తున భూమిని ఆక్రమించే డంపింగ్ యార్డుల అవసరం ఉండద న్నారు సాధారణంగా చెత్తను తగలబెడితే విషవా యువులు వస్తాయని కానీ ప్లాస్మా పద్ధతిలో గాలి తక్కువగా ఉండటం వల్ల హానికరమైన పొగ రాదన్నారు. తడి,పొడి చెత్తతో పాటు ప్రమాదకరమైన బయో- మెడికల్ వేస్ట్‌ను కూడా ఇది సురక్షితంగా నాశనం చేస్తుందన్నారు. దీనిని నడపడానికి నిపుణులైన సిబ్బంది అవస రమని ?మన దేశంలో కొన్ని ప్రధాన నగరాల్లో,మున్సి పాలిటీల్లో పైలట్ ప్రాజెక్టులుగా దీనిని ప్రయోగిస్తు న్నారు. చెత్త సమస్యకు ఇది ఒక శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, తహాశీల్దారు వి. దివాకర్, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# శేషాద్రిరావు ఇంజినీరింగ్‌లో నైపుణ్యాభివద్ధి శిక్షణ..



**గుడ్లవల్లేరు,మే 6 (వార్తాప్రభ) :** శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో అకాడమిక్ స్ట్రెంగ్థనింగ్ అండ్ అడ్వానట?స్మంట్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపక వర్గానికి గురువారం నైపుణ్యాభివద్ధి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ బుధవారం తెలిపారు. అధ్యాపకుల బోధనా నైపుణ్యాలను మెరుగు పరచడమే లక్ష్యంగా 'బోధనా విధానాలు మరియు ఫలితాధారిత విద్యా విధానాల ద్వారా విద్యను మెరుగుపరచడం -- నూతన జాతీయ విద్యా విధానం 2020' అను అంశంపై అధ్యాపకుల నైపుణ్యాభివద్ధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయనతో పాటు డైరెక్టర్ డాక్టర్ పి సిద్ధయ్య, అకాడమిక్ స్ట్రెంగ్థనింగ్ అండ్ అడ్వానట?స్మంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎం కామరాజులు చెప్పారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఐఐటి మద్రాస్ నుండి పూర్వ ప్రొఫెసర్ ఎన్ శివ ప్రసాద్, ఐఐటి భువనేశ్వర్ నుండి పూర్వ డైరెక్టర్ -- ప్రొఫెసర్ ఆర్ వి రాజా కుమార్, ఐఐటి తిరుపతి నుండి డైరెక్టర్ -- ప్రొఫెసర్ కె ఎన్ సత్యనారాయణ, ఐఐటి ఢిల్లీ నుండి పూర్వ డైరెక్టర్ -- ప్రొఫెసర్ వి ఎస్ రాజు విచ్చేయనున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రస్తుత కాలంలో విద్యార్థుల సమగ్ర అభివద్ధికి అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకం మరియు విశ్వసనీయమైనదనీ, కేవలం పాఠ్యపుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా ప్రాక్టికల్ నైపుణ్యాలను, విశ్లేషణాత్మక మరియు పరిశీలనాత్మక ఆలోచన ధోరణులను పెంపొందించే విధంగా బోధన జరగాలన్నారు. తదనుగుణంగా కళాశాల అధ్యాపకులకు ఆధునిక బోధనా విధానాలు, సాంకేతిక వినియోగం, ఫలితాధారిత విద్య, తదితర అంశాలపై శిక్షణ మరియు నూతన జాతీయ విద్యా విధానం -- 2020పై ప్రత్యేక అవగాహనను ఈ కార్యక్రమంలో అందివ్వనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల అకాడమిక్ అండ్ స్ట్రెంగ్ధనింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం కామరాజు సమన్వయకర్తగా ఉన్నారని అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి సిద్ధయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి రవీంద్ర బాబు, పి జి సి ఆర్ డి డైరెక్టర్ డాక్టర్ జి వి ఎస్ ఎన్ ఆర్ వి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి కోదండ రామారావు, డాక్టర్ ఎం ఆర్ సి హెచ్ శాస్త్రి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# అమలాపురంలో మెరిసిన తన్విక ఆభరణాల వైభవం

## –మలబార్ గోల్డ్ ప్రత్యేక కలెక్షన్ ఘనంగా ఆవిష్కరణ




**అమలాపురం,మే 6 (వార్తాప్రభ) :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని మలబార్ గోల్డు ,డైమండ్స్ షోరూంలో అత్యంత వైభవంగా "తన్విక" ప్రత్యేక ఆభరణాల కలెక్షన్‌ను ఆవిష్కరించారు. సంప్రదాయ కళాత్మకతకు ఆధునిక ఫ్యాషన్ శైలిని జోడిస్తూ రూపొందించిన ఈ ప్రత్యేక కలెక్షన్ ఆభరణ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి హాజరైన కస్టమర్లు, ఆభరణాల డిజైన్లను ఆసక్తిగా వీక్షించి, కొత్త కలెక్షన్‌ను ఘనంగా ప్రారంభించారు. "తన్విక" కలెక్షన్‌లో రూపొందించిన ప్రతి ఆభరణం భారతీయ సాంప్రదాయ విలువలను ప్రతిబింబించేలా ఉండటంతో పాటు ఆధునిక మహిళల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక శైలిలో రూపొందించబడింది. దేవాలయ కళా సంప్రదాయాల ప్రేరణతో తయారైన ఈ నగలు శాశ్వత అందాన్ని, విలాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రత్యేకంగా వధువుల కోసం రూపొందించిన హారాలు, డైమండు నెక్లెస్‌లు, చెవి దిద్దులు, వంకీలు, బ్రేస్‌లెట్‌లు, లైట్‌వెయిట్ గోల్డ్ జ్యువెలరీ, సంప్రదాయ డిజైన్లతో కూడిన ప్రీమియం కలెక్షన్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీ అభిన్ పి.పి పాల్గొని మాట్లాడుతూ, వినియోగదారుల విశ్వాసమే మలబార్ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యతతో పాటు పారదర్శక సేవలను అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భారతీయ ఆభరణాల రంగంలో నూతన ట్రెండ్‌లను పరిచయం చేస్తూ, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వినూత్న డిజైన్లను అందిస్తున్నామని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా విశ్వసనీయ ఆభరణాల బ్రాండుగా గుర్తింపు పొందిన మలబార్ గోల్డు అండ్ డైమండ్స్ తమ వినియోగదారులకు 11 న్యాయమైన వాగ్దానాలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందింది. పారదర్శక ధర విధానం,జీవితకాల ఉచిత నిర్వహణ సేవలు, బంగారం మార్పిడిలో పూర్తి విలువ, బి.ఐ.ఎస్ హాల్ మార్కు ధృవీకరణ, ఐజిఐ/జిఐఏ సర్టిఫైడ్ వజ్రాభరణాలు, బైబ్యాక్ గ్యారెంటీ, క్యారెట్ ఎనలైజర్ ద్వారా నాణ్యత పరీక్ష వంటి విశ్వసనీయ సేవలను అందిస్తూ వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటోంది. 1993లో ప్రారంభమైన మలబార్ గోల్డు అండ్ డైమండ్స్ నేడు ప్రపంచ వ్యాప్తంగా 445కి పైగా షోరూంలతో అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామి ఆభరణాల విక్రయ సంస్థగా ఎదిగింది. ప్రపంచంలోని అతిపెద్ద జ్యువెలరీ రిటైలర్లలో 6వ స్థానాన్ని దక్కించుకున్న ఈ సంస్థ, డెలాయిట్ గ్లోబల్ పవర్స్ ఆఫ్ లగ్జరీ గూడ్స్ 2023 ర్యాంకింగ్స్‌లో 19వ స్థానాన్ని పొందడం విశేషం.నాణ్యత, విశ్వసనీయత, వినూత్నతకు ప్రతీకగా నిలుస్తున్న మలబార్ గోల్డు, డైమండ్స్, భారతీయ ఆభరణ రంగంలో ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తోంది. అమలాపురం షోరూంలో నిర్వహించిన తన్విక కలెక్షన్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక ఆభరణ ప్రియుల్లో విశేష స్పందనను రేకెత్తించింది. కొత్త డిజైన్లు,ఆకర్షణీయమైన కళాత్మక రూపకల్పనలు, నమ్మకమైన సేవలతో ఈ కలెక్షన్ వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటోందని నిర్వాహకులు తెలిపారు.

# చేవెంద్ర లో గంగానమ్మ దేవస్థానం ప్రతిష్ట..

## పాల్గొన్న ప్రముఖులు



**పెడన,మే 6 (వార్తాప్రభ) :** పెడన మండలం చేవెంద్ర గ్రామంలో శ్రీ గంగానమ్మ తల్లి వారి దేవస్థానం ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ వైసీపీ నియోజకవర్గం ఇంచార్జ్ ఉప్పాల రాము జనసేన నాయకులు కొరియర్ శ్రీను వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం చేవెంద్ర గ్రామంలో శివాలయం నల్లమోతు వారి దేవరమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188